RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 237 మేడ్చల్ మల్కాజ్‌గిరి 18 సెప్టెంబర్ 2024 బుధవారం పేజీలు : 4

## భారత్ - బంగ్లా సరిహద్దుల్లో కొనసాగుతున్న హైఅలర్ట్

ఢిల్లీ: భారత్ – బంగ్లా సరిహద్దుల్లో హైఅలర్ట్ కొనసాగుతోంది. బంగ్లాదేశ్ పరిణామాల నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. బంగ్లా–భారత్ సరిహద్దుల్లో రాకపోకలను భద్రతా సిబ్బంది తాత్కాలికంగా నిలిపివేసింది. సరిహద్దులకు అదనపు బలగాలను బీఎస్ఎఫ్ తరలించింది. ఆర్మీ యూనిట్లను కూడా ప్రభుత్వం అప్రమత్తం చేసింది. బంగ్లాదేశ్ విద్యార్థి సంఘం నేతలతో నేడు ఆ దేశ ఆర్మీ చీఫ్ భేటీ అయ్యారు. దేశంలో నెల కొన్న అశాంతి, అల్లర్ల నేపథ్యంలో కీలక భేటీ జరిగింది. బంగ్లా ప్రధాని షేక్ హసీనా దేశం విడిచి వెళ్లిన తర్వాత కూడా అల్లర్లు కొనసాగాయి. ప్రధాని నివాసం, చీఫ్ జస్టిస్ నివాసం సహా అనేక అధికారిక నివాసాల్లోకి చొరబడి ఆందోళనకారులు లూటీ చేశారు. అల్లర్లను అదుపుచేసే ప్రయత్నాల్లో బంగ్లాదేశ్ ఆర్మీ, పోలీసు బలగాలు ఉన్నాయి.

## నేను ఫామ్‌హౌస్ సీఎంను కాదు.. పనిచేసే సీఎంను

హైదరాబాద్: తెలంగాణ అంటేనే త్యాగం, బలిదానం అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. రాచరిక వ్యవస్థకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రజలు పోరాడారని గుర్తు చేశారు. తెలంగాణ ప్రభుత్వం తరపున పబ్లిక్ గార్డెన్స్‌లో ప్రజాపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జాతీయ జెండా ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అంతకుముందు ముఖ్యమంత్రి గన్‌పార్క్ వద్ద అమరవీరులకు నివాళులు అర్పించారు. సెప్టెంబరు 17న తెలంగాణ ప్రజాపాలన



దినోత్సవం నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడారు. "రాష్ట్ర ప్రజలకు ప్రజాపాలన దినోత్సవ శుభాకాంక్షలు. సెప్టెంబర్ 17న ప్రజాపాలన దినోత్సవాన్ని నిర్వహించాలని నిర్ణయించాం. విమోచనం, విలీనం అంటూ స్వప్రయోజనాల కోసం ప్రవర్తించడం సరికాదు. తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తిని ఎవరూ తప్పుపట్టవద్దు. పెత్తందార్లు, నియంతలపై పిడికిలి బిగించి పోరాటం చేశాం. నియంత నుంచి తెలంగాణకు స్వేచ్ఛ కల్పిస్తామని ఆనాడు భరోసా ఇచ్చాం. పదేళ్లపాటు విధ్వంసమైన తెలంగాణను మళ్లీ గాడిలో పెడుతున్నాం. పాలన పారదర్శకంగా ఉండాలని కోరుకుంటున్నాం. డిసెంబర్ 9న తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరిస్తాం. గత పదేళ్లలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేశారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం దిల్లీ వెళ్లినా విమర్శలు చేస్తున్నారు. నేను ఫామ్‌హౌస్ సీఎంను కాదు.. పనిచేసే సీఎంను. మన హక్కుల సాధన కోసం ఎన్ని సార్లైనా దిల్లీకి వెళ్తాం" అని రేవంత్ రెడ్డి అన్నారు.




## రైతు భరోసాపై బిగ్ అప్డేట్.. అకౌంట్లోకి రూ.15వేలు పడేది అప్పుడే.. డేట్ ఫిక్స్!

అమరావతి : సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఈనెల 20న సచివాలయంలోయ కేబినెట్ భేటి జరగనుంది. ఈ సమావేశంలో మంత్రి వర్గం పలు కీలక విషయాలను చర్చించనుంది. వ్యవసాయ రుణమాఫీని సంపూర్ణంగా అమలు చేయడం, పంటల బీమా, రైతు భరోసా, హైడ్రాకు చట్టబద్ధత కల్పించే ఆర్డినెన్స్ జారీకి సంబంధించి పలు అంశాలపై చర్చించే అవకాశం ఉంది. రాష్ట్రంలో రూ. 2 లక్షల వరకు ఉన్న పంట రుణమాఫీని ప్రభుత్వం చేపట్టింది. రూ. 2 లక్షల కంటే ఎక్కువ మొత్తంలో ఉన్న రుణాలు ఇంకా మాఫీ కాలేదు. దీంతో వారికి దశల వారీగా మాఫీ చేయడానికి ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందుకు క్యాబినెట్ ఆమోదం కావాలి. రైతుబంధు స్థానంలో రైతుభరోసాను పంట పెట్టుబడుల కోసం ప్రవేశపెట్టనుంది. దీనికి సంబంధించిన అమలు, పరిమితులపై జిల్లాల వారీగా అభిప్రాయాలు సేకరణ చేపట్టనుంది. వర్షాకాలం ముంగిపు దశకు చేరుకున్నా సరే.. రైతు భరోసాను అమలు చేయకపోడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో దీనిపైన కూడా కేబినెట్ కీలక నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. ఇప్పటికే దీనికి సంబంధించి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల కీలక వ్యాఖ్యలు చేశారు. ఎవరైతో పొలంలో పంటలు వేసారో వారికి డబ్బులు ఇస్తామన్నారు. దీనిపై మంత్రిమండలి చర్చించి నిర్ణయం తీసుకోనుంది.

మరోవైపు కేంద్ర ప్రభుత్వ పంటల బీమా పథకాన్ని రాష్ట్రంలోనూ అమలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. దీంతో రైతులకు సంబంధించి ఈ కేబినేట్ భేటి కీలకంగా మారనుంది. అక్టోబర్ నెలలో ఎలా అయినా సరే రైతు భరోసా డబ్బులను రైతుల ఖాతాల్లో జమ చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.




హైదరాబాద్: ఖైరతాబాద్ మహా గణపతి నిమజ్జన ప్రక్రియ ముగిసింది. వేలాది భక్తుల జయ జయ ధ్వానాల మధ్య.. ఎన్టీఆర్ మార్గ్‌లోని నాలుగో నంబర్ క్రేన్ వద్ద బడా గణేశుడిని నిమజ్జనం చేశారు. అంతకుముందు ఉత్సవ కమిటీ నిర్వాహకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇక ఈ ఉదయం ప్రారంభమైన మహా గణపతి శోభాయాత్ర వైభవంగా సాగింది. మధ్యాహ్నానికి హుస్సేన్‌సాగర్ వద్దకు చేరుకుంది. ఈ శోభాయాత్రలో భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో శోభాయాత్ర మార్గంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.




## బీఆర్ఎస్ లో 'స్థానిక' గుబులు రేవంత్ తొందరపడేది అందుకేనా?

హైదరాబాద్ : వరుస ఓటమిలు, వలసల జోరు, కేసులు బీఆర్ఎస్ పార్టీని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. సరిగ్గా ఇదే సమయంలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి లోకల్ బాంబు పేల్చారు. త్వరలోనే పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తామని అంటున్నారు. కులగణన, బీసీ రిజర్వేషన్ వంటి అంశాల జోలికి వెళ్లకుండా గతంలో మాదిరిగానే ఎన్నికలు నిర్వహించాలని రేవంత్ సర్కార్ భావిస్తోంది. రిజర్వేషన్ ప్రక్రియ ప్రారంభిస్తే అందుకు చాలా సమయం తీసుకునే అవకాశం ఉంది. ఈ సంవత్సరానికి ఎన్నికలు నిర్వహించడం సాధ్యం కాదు. అందుకే ఈ సారికి కులగణన, బీసీ రిజర్వేషన్ల ను టచ్ చేయకుండానే పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని భావిస్తున్నట్లు సమాచారం.

**అల్లకల్లోలంగా బీఆర్ఎస్ :** రేవంత్ ఇంత హడావిడిగా ఎన్నికలు ఎందుకు జరపాలని అనుకుంటున్నారు? ప్రతిపక్షాలను ఇరుకున పెట్టి తాను లబ్ది పొందేందుకేనా అని అనుకుంటున్నారంతా. ప్రస్తుతం బీఆర్ఎస్ పరిస్థితి అల్లకల్లోలంగా ఉంది. పార్టీలో ఎవరు ఉంటారో

## దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టేలా...

## కాంగ్రెస్ సర్కార్ వ్యూహం!!

ఎవరు వీడతారో అని అగ్ర నేతలు తలలు పట్టుకుంటున్నారు.

కనీసం జిల్లా స్థాయి ఇన్ ఛార్జిలు కూడా దొరకడమే కష్టమైపోతోంది బీఆర్ఎస్ కు. పార్టీ మారం అని ఖచ్చితంగా చెప్పిన నేతలే మర్నాడు కండువా మార్చేస్తున్నారు. క్షేత్ర స్థాయి నేతలలో తీవ్ర నిరుత్సాహం నెలకొని ఉంది. ఇలాంటి పరిస్థితిలో బీఆర్ఎస్ స్థానిక పోరుకు సంసిద్ధంగా లేదన్నట్లు తెలుస్తోంది.

**బీజేపీని వెంటాడుతున్న బడ్జెట్ భయం :** ఇక బీజేపీది మరో చిత్రమైన పరిస్థితి. అసెంబ్లీ లో ఎనిమిది, పార్లమెంట్ లో ఎనిమిది సీట్లు అనూహ్యంగా సాధించిన బీజేపీ సర్కార్ వచ్చే ఎన్నికలలో అధికార పీఠాన్ని ఎలాగైనా దక్కించుకోవాలనే యోచనలో ఉంది. అయితే మొన్నటి పార్లమెంట్ బడ్జెట్ తర్వాత తెలంగాణ బీజేపీ నేతలు డైలమాలో పడ్డారు. ఎనిమిది మంది ఎంపీలు , ఇద్దరు కేంద్ర స్థాయి మంత్రులు ఉండి కూడా తెలంగాణకు నిధులు,ప్రాజెక్టులు రాబట్టలేకపోయారని ట్రోలింగులు ఎదుర్కొంటున్నారు. ఇదే అంశాన్ని తెలంగాణ అసెంబ్లీలో రేవంత్ రెడ్డి బీజేపీ సర్కార్ పై తీవ్ర స్థాయిలో విరుచుకు పడ్డారు. ఇప్పుడు పంచాయతీ ఎన్నికలలో ఇదే అంశాన్ని హైలెట్ చేస్తే బీజేపీ పై వ్యతిరేకత పెంచేలా చెయ్యవచ్చని భావిస్తున్నారు. అందుకే ఇక ఏ మాత్రం ఆలస్యం చేయకుండా సాధ్యమైనంత తొందరలో పంచాయతీ ఎన్నికల నిర్వహణ జరిపిస్తే కాంగ్రెస్ కు ఎదురే లేదని చెప్పవచ్చు. ఫలితాలను చూపించి అధిష్టానం దృష్టిలో తన సత్తా ఏమిటో నిరూపించుకోవచ్చు

**క్యాడర్ తో బీఆర్ఎస్ కు సమస్య :** ఇప్పుడిదే ఆలోచనతో సీఎం రేవంత్ రెడ్డి పంచాయతీ ఎన్నికలు తొందరలోనే జరిపించాలనే లక్ష్యం పెట్టుకున్నారు.ఇప్పుడు ఈ ఎన్నికలలో ఎలా ముందుకు వెళ్లాలి? ఎలా జనం అభిమానం చూరగొనాలి? ఒకవేళ క్యాడర్ రివర్స్ అయితే పార్టీ పరిస్థితి ఏమిటి? పార్టీ క్యాడర్ లో నూతనోత్సాహం కలిగించడానికి ఏం చేస్తే బాగుంటుంది అని బీఆర్ఎస్ అగ్రనేతలంతా ఆందోళనలో ఉన్నట్లు తెలుస్తోంది. గత ఎన్నికలలో అధికారంలో ఉన్నది కాబట్టే స్థానిక పోరులో అత్యధిక స్థానాలు రాబట్టగలిగింది బీఆర్ఎస్. ఈ సారి అధికారానికి దూరంగా ఉండటం, పైగా ప్రజలలో విశ్వాసం కోల్పోవడం, పార్లమెంట్ ఫలితాలు మళ్లీ రిపీట్ అవుతాయా అని ఆందోళన పడుతున్నారు బీఆర్ఎస్ నేతలు. అందుకే ఎలాగైనా బీసీ కులగణన చేయాల్సిందేనని ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకొచ్చే ప్రయత్నం చేసి ఎలాగైనా మరి కొంతకాలం పంచాయతీ ఎన్నికలు జరగకుండా ఆపగలిగితే తాము లబ్ది పొందవచ్చని భావిస్తున్నారు.

**ఎన్నికలు ఆపేందుకు ప్రయత్నాలు :** ఇంకా ఏమైనా లొసుగులు ఉంటే అవసరమైతే కోర్టు ద్వారా పంచాయతీ ఎన్నికలు నిలుపుదల చేసేందుకు వ్యూహాలు రచిస్తున్నారు. ఇవన్నీ పట్టించుకోని రేవంత్ సర్కార్ మాత్రం ఎట్టి పరిస్థితిలోనూ పంచాయతీ ఎన్నికలను నిర్వహించాలనే కృత నిశ్చయంతో ఉంది. పోరుకు పోతే తమకే నష్టం అని భావిస్తున్న బీఆర్ఎస్ గెలిచే ప్రాంతాలలో తప్ప తక్కిన చోట్ల పోటీచేయకూడదని భావిస్తున్నట్లు సమాచారం. అయితే రణం లేకుంటే శరణం ఇదీ పార్టీ పరిస్థితి అని జనం చర్చించుకుంటున్నారు.

## తెలంగాణ భూముల రేట్లు భారీగా పెంపు?



హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత భూముల రేట్లు అమాంతం పడిపోయాయి. అసలు భూములు కొనేందుకు కూడా ఇద్దరు ముందుకు రావడం లేదు. కెసిఆర్ ప్రభుత్వం దిగిపోవడంతో... ఈ పరిస్థితి నెలకొంది. అయితే రాజ్యాంగ తెలంగాణ రాష్ట్రంలో భూముల ధరలు పెంచేలా చర్యలు తీసుకుంటుంది రేవంత్ రెడ్డి సర్కార్. తెలంగాణ రాష్ట్రంలో భూముల ధరలు.. సెప్టెంబర్ లో పెరిగే ఛాన్స్ లు ఉన్నాయని రిజిస్ట్రేషన్ శాఖ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. ఎంత మేర ధరలు పెరగవచ్చు అనే దానిపై త్వరలోనే క్లారిటీ రాబోతుందని కూడా తెలిపింది. దీనిపైన రిజిస్ట్రేషన్ల శాఖ కసరత్తు చేస్తోందని సమాచారం.

ఇక అనంతరం తెలంగాణ ప్రభుత్వానికి నివేదిక కూడా ఇవ్వనుందట ఈ రిజిస్ట్రేషన్ల శాఖ. ఆ తర్వాత రెవెన్యూ మంత్రి సమీక్షించి తుది నిర్ణయం తీసుకుంటారని తెలిపారు అధికారులు. ధరల పెంపు ప్రతిపాదనను సంబంధిత వెబ్సైట్లో ఉంచి ప్రజాభిప్రాయం సేకరిస్తారని కూడా అధికారులు తెలుపుతున్నారు. ఈ ప్రక్రియకు మరో 30 రోజుల సమయం పట్టే ఛాన్స్ ఉందని అంటున్నారు.

గరుడ వార్త

బుధవారం 18 సెప్టెంబర్ 2024

# ఎందరో మహనీయుల త్యాగమే తెలంగాణ రాష్ట్ర అవతరణ...









జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజ్గిరి (గరుడ వార్త) : ఎంతోమంది మహనీయుల అసమాన త్యాగాల ఫలితమే నేటి తెలంగాణ, ఆ పోరాట పటిమను స్పూర్తిగా తీసుకొని మన జిల్లాను అభివృద్ధి పథంలో ముందుంచేందుకు అందరూ కృషి చేయాలని ఎం.ఎల్.సి డా.పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో మంగళవారం తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ప్రజాపాలన దినోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎం.ఎల్.సి డా.పట్నం మహేందర్ రెడ్డికి జిల్లా కలెక్టర్ గౌతం పుష్పగుచ్ఛం అందజేసి సాదరంగా ఆహ్వానించారు. తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎం.ఎల్.సి డా.పట్నం మహేందర్ రెడ్డి జెండా ఎగురవేసి గౌరవ వందనం స్వీకరించారు.ఈ సందర్భంగా ఎం.ఎల్.సి డా.పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ మహనీయుల అసమాన త్యాగాల ఫలితమే నేటి తెలంగాణ అని, ఆ పోరాట పటిమను స్పూర్తిగా తీసుకొని మన జిల్లాను అభివృద్ధి పథంలో ముందుండేలా కృషి చేయాలన్నారు. తెలంగాణ ప్రజల సమస్యలను తెలుసుకొని పరిష్కరించడానికి, రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రజాపాలన కార్యక్రమం ద్వారా, ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించి జాప్యం లేకుండా పరిష్కరిస్తూ ప్రజలకు మెరుగైన సేవలను అందిస్తూ సమగ్ర అభివృద్ధికి తోడ్పడుతున్నందుకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఋణభారంతో బ్రతుకు భారమైన తెలంగాణ రైతన్న నేడు "రైతు నేస్తం" పథకం ద్వారా అందించే రైతు ఋణమాఫీతో రైతులు గర్వంగా తలెత్తుకొని తిరుగుతున్నారన్నారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన "మహాలక్ష్మి" పథకం ద్వారా ఇచ్చిన గ్యారెంటీలతో రాష్ట్రమంతటా బాలికలు, మహిళలు, ట్రాన్స్ జెండర్లకు ఉచిత బస్సు సౌకర్యం, "మహాలక్ష్మి" వంట గ్యాస్ సబ్సిడి పథకం ద్వారా మన జిల్లాలో 500 రూపాయలకే అర్హులైన 74వేల 457 మంది లబ్దిదారులకు నేటి వరకు ఒక లక్ష 72 వేల 393 గ్యాస్ సిలిండర్లను, గృహజ్యోతితో పేదల ఇంట వెలుగులు ఆడబిడ్డ కన్నీళ్లు తుడవాలన్న లక్ష్యంతో మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ప్రతి నెల 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు సరఫరాల ద్వారా లబ్దపొందుతున్నారు. వైద్యం అందక ఏఒక్కరి ప్రాణాలు పోకూడదనే ఆశయంతో కొత్తగా 163రకాల చికిత్సలను చేరుస్తు మొత్తం 1835 రకాల చికిత్సలు, 5 లక్షల నుండి 10 లక్షల రూపాయల వరకు "రాజీవ్ ఆరోగ్య శ్రీ" పథకం ద్వారా సత్వర ఉచిత వైద్యం అందించడమే కాకుండా, రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమం క్రింద పాఠశాల విద్యార్థులకు చేసే వైద్య పరీక్షల్లో రాష్ట్రంలోనే మన జిల్లా మొదటి స్థానంలో ఉందన్నారు. నాణ్యమైన విద్యతోపాటు విజ్ఞాన, నైపుణ్య, సామర్థ్యాలను పెంచుతూ విద్యార్థులను తీర్చిదిద్ది భవిష్యత్ తరాలకు ఆదర్శవంతమైన పౌరులను సమాజానికి అందించడానికై రాష్ట్ర ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలలను రూపకల్పన చేసి వారికి బంగారు భవిష్యత్తుకై కృషి చేస్తుందన్నారు. మాతా శిశు మరణాలు లేకుండా ఉండేందుకు వారి ఆరోగ్యం పట్ల శ్రద్ద వహించే ప్రభుత్వం ద్వారా మన జిల్లాలో 7 వందల 93 అంగన్ వాడీ కేంద్రాల ద్వారా 64 వేల 169 మంది పిల్లలకు మరియు 9 వేల 358 మంది గర్భిణీ మరియు బాలింతలకు పౌష్టికాహారం, ఇమ్యూనైజేషన్ అందిస్తుందన్నారు. అంతే కాకుండా మహిళలు, చిన్నారుల భద్రత కోసం "టీ సేఫ్" యాప్ ద్వారా 24 గంటలు రక్షణ కల్పించడానికి ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. మన ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అర్హులైన వారందరికి అందిస్తూ సామాజిక అభివృద్ధి లో ముందుకు సాగేందుకు మీరందరు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిసిపి కోటిరెడ్డి, అదనపు కలెక్టర్లు రాధికా గుప్తా, విజయేందర్ రెడ్డి, డిఆర్ఓ హరిప్రియ, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు. ముందుగా తెలంగాణ సాంస్కృతిక శాఖ కళాకారుల పాడిన తెలంగాణ గీతాలు ఆహుతులను అలరించాయి.

# శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ఘనంగా అన్న ప్రసాద వితరణ

శామీర్ పేట, (గరుడ వార్త) : శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ఘనంగా అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రం శామీర్ పేట లోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద శామీర్ పేట కు చెందిన దిలీప్, టపాస్, గుల్యా గారి నర్సింగ్ రావు గౌడ్- జ్యోతి దంపతులు, నేంటూర్ అశోక్ గౌడ్ వారి కుటుంబ సభ్యులు అన్నదానం చేపట్టారు. వివిధ గ్రామాల భక్తులు మాజీ ప్రజా ప్రతినిధులు, రాజీవ్ రహదారి పై వెళ్లే భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు.





# పూర్వ ఉమ్మడి మండలంలో తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ వేడుకలు

## ప్రభుత్వ కార్యాలయాల వద్ద జాతీయ జెండా ఆవిష్కరణ






శామీర్ పేట, (గరుడ వార్త) తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని పూర్వం ఉమ్మడి శామీర్పేట మండలంలో మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. శామీర్ పేట మండలం తూంకుంట మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ చైర్మన్ రాజేశ్వరరావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్ తన సిబ్బందితో స్వచ్ఛభారత్ ప్రతిజ్ఞను చేయించారు. మున్సిపల్ పరిధిలోని దేవరయాంజాల్ లో రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భీమిడి జైపాల్ రెడ్డి, మున్సిపల్ 4 వ వార్డు కౌన్సిలర్ సింగిరెడ్డి మధుసూదన్ రెడ్డి, పలువురు కాంగ్రెస్ నాయకులతో కలిసి తెలంగాణ తల్లి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించి, జాతీయ జెండాను ఎగురవేశారు. శామీర్ పేట మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో మమతబాయి జాతీయ జెండా ఆవిష్కరించి ప్రజాపాలన దినోత్సవం జరుపుకున్నారు. శామీర్ పేట తహసిల్దార్ కార్యాలయం వద్ద తాహసిల్దార్ యాదగిరి రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. మండల కేంద్రం శామీర్ పేటలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ గౌడ ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఎగరవేసి ప్రజాపాలన దినోత్సవం నిర్వహించారు. అలాగే లాల్ గడి మలక్ పేట గ్రామపంచాయతీ వద్ద ప్రత్యేక అధికారి శ్రీనివాస మూర్తి ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఆవిష్కరించి వేడుకలు జరుపుతున్నారు. ఉమ్మడి శామీర్ పేట మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల వద్ద, ప్రభుత్వ కార్యాలయాలు వద్ద జాతీయ జెండాను ఎగురవేసి ప్రజాపాలన దినోత్సవ వేడుకలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, దేవరయంజాల్ లోమాజీ ఉప సర్పంచ్ తిరుపతి శంకర్ గౌడ్, మున్సిపల్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు వలందాస్ మురళి గౌడ్, కందాల రాము, మున్సిపల్ కాంగ్రెస్ కార్యదర్శి తిగుళ్ళ మురళి గౌడ్, మున్సిపల్ కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షుడు పిన్నింటి ధర్మారెడ్డి, మున్సిపల్ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షులు భీమిడి కొండల్ రెడ్డి, మున్సిపల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు టి జగదీష్, మాజీ రామాలయం మాజీ ధర్మకర్త పట్నం నర్సింహారెడ్డి, మున్సిపల్ కాంగ్రెస్ ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి తిగుళ్ల దర్శన్ గౌడ్, మున్సిపల్ కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు సుతారిగూడెం దుర్గయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, లాల్ గడి మలక్ పేట పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, బిజెపి నాయకులు మామిండ్ల అశోక్, రాజిరెడ్డి, యాదగిరి, ప్రభాకర్ రెడ్డి, సిహెచ్ శ్రీనివాస్, అంగన్వాడీ టీచర్లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# శామీర్ పేట పెద్ద చెరువులోప్రశాంతంగా భక్తుల కోలహాలు మధ్య గణనాధుల నిమజ్జనాలు



శామీర్ పేట, (గరుడ వార్త) : శామీర్ పేట పెద్ద చెరువులో గణనాధుల నిమజ్జనాలు ప్రశాంతంగా భక్తుల కోలాహలం మధ్య మంగళవారం జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద చెరువు వద్దకు వచ్చిన భక్తులు, గణేష్ ఉత్సవాల నిర్వహకులు ఎంతో ఉత్సాహంగా, భక్తిశ్రద్దలతో పాటలను పాడుతు గణనాథులకు వీడ్కోలు పలికి నిమజ్జనం చేశారు. ఉమ్మడి మండలం లోని పలు ప్రాంతాలతో పాటు నగరం సమీప ప్రాంతాల నుంచి గణేష్ విగ్రహాలను ఊరేగింపుగా తీసుక వచ్చి పెద్ద చెరువు లో ఎంతో భక్తిశ్రద్దలతో భక్తులు, సిబ్బంది నిమజ్జనం గావించారు. గణేష్ ఉత్సవాల ఆర్గనైజర్లు, భక్తులు ఎంతోఉత్సాహంతో చిన్న, పెద్ద గణేష్ విగ్రహాలను భారీగా తీసుక వచ్చి పూజలు నిర్వహించిన అనంతరం పెద్ద చెరువులో నిమజ్జనం చేశారు. శామీర్ పేట జాలర్లు, ఫైర్ సిబ్బందితో గణనాథులను నిమజ్జం చేశారు. నిమజ్జనాల వద్ద విద్యుత్ శాఖ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. తూంకుంట మున్సిపల్ కమిషనర్ వెం కటగోపాల్, సిబ్బంది, మండలంలోని వివిధ గ్రామాల పంచాయతీ సిబ్బంది, పం చాయతీ కార్యదర్శులు, నిమజ్జనాల వద్ద పర్యవేక్షించారు. వివిధ గ్రామాల పం చాయతీ సిబ్బది, కార్మికులు పరిసరాలను ఎప్పటి కప్పుడు శుభ్రం చేశారు. పోలీసు సిబ్బంది ఎలాంటి ఘటనలు జరుగకుండా ఇన్స్పెక్టర్ శ్రీనాథ్ ఆధ్వర్యంలో బందో బస్తు చేపట్టారు. పోలీస్ బృందాలు డాగ్స్ కార్డలతో తనిఖీలను నిర్వహించారు. వైద్య ఆరోగ్య సిబ్బంది స్పెషల్ క్యాంపు ఏర్పాటు చేసి మందులు పంపిణీ చేశారు. ఫైర్ సిబ్బంది ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఫైర్ ఇంజన్ వాహనంతో పాటు నీటిలో బోటును సిద్ధంగా ఏర్పాటు చేశారు. పలు శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటులను చేయగా భక్తులు ఆనందోత్సవాల మధ్య గణనాథులను నిమజ్జనం గావించారు.

## శామీర్ పేట పెద్ద చెరువులో గణేష్ నిమజ్జన ఏర్పాట్లను విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు పరిశీలించారు





శామీర్ పేట, (గరుడ వార్త) : శామీర్ పేట పెద్ద చెరువులో జరుగుతున్న గణేష్ విభజన ఘట్టంలో విద్యుత్ ఏర్పాట్లను విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు మంగళవారం సాయంత్రం సందర్శించి పరిశీలించారు. శామీర్ పేట పెద్ద చెరువులో వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున గణేష్ విగ్రహాలను నిమజ్జనం గావిస్తున్నారు. ఈ నిమజ్జనాల వేడుకలను విద్యుత్ శాఖ సీజీఎం సాయిబాబా, ఎస్ ఈ రవికుమార్, ఏ డి ఈ రమణారెడ్డి, ఏఈ సురేందర్, సబ్ ఇంజనీర్లు శ్రీధర్, యాదగిరి, విద్యుత్, లైన్ ఇన్స్పెక్టర్, లైన్మెన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఇసుకను తోడి.. హద్దులు మీరి

కామారెడ్డి: బిచ్కుంద మండలం ఖద్గాం-శెట్లూర్ శివారులో ఆరు క్వారీలలో ఇసుక తవ్వకాలకు గత ప్రభుత్వం అనుమతులిచ్చింది. ఆయా రీచ్‌లలో తవ్వకాలు చేసే గుత్తేదారుల కాలపరిమితి ముగిసింది. నిర్దేశించిన మేర ఇసుక తవ్వకాలు పూర్తికాలేదనే నెపంతో మూడు నెలల కిందట ఇసుకాసురులు మళ్లీ అనుమతులు సాధించారు. ఖద్గాంలోని క్వారీ, గుండెనెమ్లిలోని మరో క్వారీలో రాత్రి, పగలు తేడా లేకుండా ఇసుక తవ్వకాలు ప్రారంభించారు. గుత్తేదారులు తవ్విన ఇసుకను రీచ్‌లలో డంప్ చేయాల్సి ఉంటుంది. దీనిని టీఎస్ఎండీసీ



ఆధ్వర్యంలో విక్రయించాలి. కానీ టీఎస్ఎండీసీ అధికారులతో కుమ్మక్కయిన గుత్తేదారులు రాజధానితో పాటు మహారాష్ట్ర, కర్ణాటకకు ఇసుకను తరలిస్తూ దోపిడీ చేస్తున్న తీరుపై కథనం.

సమస్తం ఉల్లంఘనలే రవాణా శాఖ నుంచి వేబిల్లులు తీసుకొని.. ఒకే బిల్లుపై పది నుంచి 20 టిప్పర్లలో ఇసుకను తరలిస్తున్నారు. క్వారీలు, రీచ్‌లలో సీసీకెమెరాలు ఏర్పాటు చేసి తవ్వకాలు చేయాలి. కానీ విరుద్ధంగా సాగుతోంది. ఎవరైనా క్వారీలు, రీచ్‌లలోకి వస్తే ప్రైవేటు సెక్యూరిటీతో దాడులు చేయిస్తూ భయపెడుతున్నారు.

రాష్ట్రంలోనే ఇసుక విక్రయించాల్సి ఉండగా.. మహారాష్ట్ర, కర్ణాటకలకు తరలిస్తున్నారు. ఇటీవల ఖద్గాం క్వారీ నుంచి అనుమతులు లేకుండా జహీరాబాద్ మీదుగా కర్ణాటకు ఇసుకను తరలిస్తున్న ఐదు లారీలను సంగారెడ్డి జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకోవడమే ఇందుకు నిదర్శనం.రాత్రి వేళల్లో వేబిల్లులు లేకుండా ఖద్గాం, గుండెనెమ్లి రీచ్‌ల నుంచి వందలాది టిప్పర్లలో ఇసుకను మహారాష్ట్రకు తరలిస్తున్నారు. రెండు రోజుల కిందట మహారాష్ట్రకు వెళ్తున్న ఐదు ఇసుక లారీలను బిచ్కుంద పోలీసులు పట్టుకుని సీజ్ చేయడమే ఇందుకు సాక్ష్యం.

# వంట నూనెలు భగభగ

వేములవాడ : కేంద్ర ప్రభుత్వం వంట నూనెలపై 20 శాతం సుంకం విధిస్తూ నిర్ణయం తీసుకోవడంతో విపణిలో ధరలు మండిపోయాయి. ఇప్పటికే నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటడంతో ఇబ్బందిపడుతున్న సామాన్యులు కేంద్ర నిర్ణయంతో మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందంగా మారింది. ఇదే అదనుగా భావించిన నూనె హెూల్‌సేల్ వ్యాపారులు తమ దగ్గర ఉన్న నిల్వలను బ్లాక్ చేశారని ఆరోపణలున్నాయి. ఉదయం దుకాణాలను తెరిచి మధ్యాహ్నానికే మూసేయడమే ఇందుకు నిదర్శనం.

విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్న పొద్దుతిరుగుడు, పామాయిల్ నూనెలపై కేంద్రం సుంకం పెంచుతూ నిర్ణయం తీసుకొంది. ఇప్పటి వరకు బహిరంగ మార్కెట్‌లో లీటరుకు రూ.110 అమ్మిన పొద్దుతిరుగుడు పువ్వు నూనెను ఒక్కసారిగా రూ.140కు పెంచేశారు. రూ.90 ఉన్న పామాయిల్‌ను రూ.120కు పెంచి విక్రయించారు. ఇదే సమయంలో తగిన నిల్వలు లేవంటూ వినియోగదారులకు మొండిచె



య్యి చూపడంతో వారు ఎక్కువ ధరపెట్టి కొనుగోలు చేయాల్సి వచ్చింది.

ప్రజలపై భారం..

జిల్లా కేంద్రంలోని ప్రకాశంగంజ్ కేంద్రంగా నిత్యం పొద్దు తిరుగుడు పువ్వు 2000 కాటన్లు, పామాయిలు 3000 కాటన్లు, 500 గ్రాముల ప్యాకెట్లు 500 కాటన్లు, 15 కిలోల బరువున్న నూనె డబ్బాలు 1000 వరకు విక్రయిస్తారు. ఒక్కో కాటన్‌లో లీటర్ బరువున్న 16 ప్యాకెట్లు ఉంటాయి. ఈ లెక్కన ఒక్కో ప్యాకెట్‌పై రూ.30 పెంచినా.. పొద్దుతిరుగుడు నూనెపై రూ.9,60,000, పామాయిల్‌పై రూ.14,40,000 అదనపు భారం పడుతోంది.

కృత్రిమ కొరతను అరికట్టేది ఎవరు?సుంకం పెంచడంతోనే ధరలను పెంచుతున్న వ్యాపారులపై పర్యవేక్షణ చేసే అధికారం జిల్లాలో కరవైంది. గతంలో పౌరసరఫరాల శాఖాధికారు లు అత్యవసర సరకుల చట్టం కింద వ్యాపారులు అడ్డగోలుగా ధరలు పెంచకుండా నియంత్రించేవారు. దాని స్థానంలో స్వేచ్ఛ వాణిజ్యం రావడంతో వారిపై అజమాయిషి కరవైంది. వారి వద్ద ఉన్న నిల్వలను దాచి.. కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. కనీసం వారి వద్ద ఉన్న నిల్వలను పాత ధరల్లో విక్రయించేలా చూడాల్సిన బాధ్యత జిల్లా యంత్రాంగంపై ఉంది.

# అమ్ముకుంటూ.. సొమ్ము చేసుకుంటూ..

ఉట్నూరు :బియ్యం, ఇతర సరకుల సరఫరాలో గోనె సంచి కీలక పాత్ర పోషిస్తోంది. దీని విలువ రూ. 20 మాత్రమే. లక్షల సంచులను కలిపితే ధర రూ.లక్షల్లో ఉంటుంది. కొందరు వీటిని స్వాహా చేస్తున్నారు. వేలం వేసి విక్రయించాల్సి ఉన్నా.. అవేమీ పట్టించుకోకుండా ఇష్టమొచ్చినట్లుగా అమ్ముకుంటూ.. సొమ్ము చేసుకుంటున్నారు. ఐటీడీఏ పాఠశాలల్లో అవినీతికి తావిస్తున్న ఈ వ్యవహారంపై కథనం. సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ(ఐటీడీఏ) ఉట్నూరు ఆధ్వర్యంలో ఆదిలాబాద్, కుమురం భీం, మంచిర్యాల, నిర్మల్ జిల్లాల్లో మొత్తం 168 గిరిజన సంక్షేమ ఆశ్రమ, గురుకుల పాఠశాలలు, వసతి గృహాలు, పోస్టు మెట్రిక్ హాస్టళ్లు, కళాశాలలు ఉన్నాయి. వీటిలో 60 వేలకుపైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వారందరికీ గిరిజన సంక్షేమ శాఖ ఉచిత విద్యతోపాటు భోజన, వసతిని కల్పిస్తోంది.

ఇలా కాజేస్తూ..

ఐటీడీఏ విద్యాలయాల్లో చదివే విద్యార్థుల కోసం పౌర సరఫరాల విభాగం 76,428 క్వింటాళ్ల బియ్యాన్ని కేటాయిస్తోంది. వాటిని గిరిజన సహకార సంస్థ(జీసీసీ) విద్యా సంస్థలకు సరఫరా చేస్తోంది. బియ్యం సరఫరా కోసం ఉపయోగిస్తున్న గోనె సంచులను ఒక్క చోటకు చేర్చి సంవత్సరానికి ఒకసారి వేలం నిర్వహించి గోనె సంచులు విక్రయించి వచ్చిన డబ్బులను గన్నీ బ్యాగ్స్ అకౌంట్‌లో జమ చేయాల్సి ఉంది. గోనె సంచుల విక్రయంతో వచ్చిన ఆదాయాన్ని ఐటీడీఏ పాఠశాలల్లో కనీస సౌకర్యాల కల్పనకు ఉపయోగించాల్సి ఉంది. ఏటా రూ.లక్షలు డబ్బులు వస్తాయని తెలిసినా ఆ దిశగా చర్యలు కొరవడ్డాయి. అధికారుల ఉదాసీనత కారణంగా వేలం అటకెక్కింది. గన్ని బ్యాగ్ అకౌంట్‌లో పాఠశాలల వసతి గృహ సంక్షేమాధికారులు(వార్డెన్లు) డబ్బులు జమ చేయడం విస్మరించారు. ఎవరికి వారే గోనె సంచులను విక్రయించుకుంటున్నారు.

ఆదాయానికి గండి

ఉమ్మడి జిల్లాలో గిరిజన సంక్షేమ శాఖ విద్యా సంస్థలకు కేటాయిస్తున్న 76,428 క్వింటాళ్ల బియ్యం కోసం 50 కిలోల సామర్థ్యం కలిగిన గోనె సంచులను ఉపయోగిస్తున్నారు. ఈ లెక్కన 1,52,856 గోనె సంచులను వినియోగిస్తున్నారు. మార్కెట్ విలువ ప్రకారం ఒక గోనె సంచి ధర రూ.20 పలుకుతోంది. వాటిని విక్రయిస్తే రూ.30,57,120 వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉంది. ఒకవేళ కొంచెం ధర తగ్గించి అమ్మినా రూ.20 లక్షల వరకు ఆదాయం సమకూరే అవకాశం ఉంది. అధికారుల పర్యవేక్షణ లోపంతో వేలం నిర్వహించక గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలల, హాస్టళ్లు రూ.లక్షల ఆదాయాన్ని కోల్పోతున్నాయి. సంచులను కొన్ని చోట్ల వార్డెన్లు, ఇంకొన్ని చోట్ల సిబ్బంది, మరికొన్ని చోట్ల కొందరు హెచ్ఎంలు తమకు తోచిన ధరలకు విక్రయించుకుంటూ.. డబ్బులు మాయం చేస్తున్నారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటా

– ఖుష్బూగుప్తా, ఐటీడీఏ పీవో

ఈ విషయం ఇప్పటి వరకు నా దృష్టికి రాలేదు. తప్పకుండా వీటిని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాను.

# ఆహార శుద్ధి.. ఉపాధి వృద్ధి

నల్గొండ: ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా వరి, పత్తి పంటలే కాకుండా వేరుసెనగ, మిర్చి, కంది, మొక్కజొన్న లాంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసే విధంగా రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఇందులో భాగంగా అన్నదాతల ఆదాయం రెట్టింపు చేయడంతో పాటు మార్కెట్‌లో ధరలను బట్టి పంటల సాగుకు ప్రోత్సాహం, ఉపాధి కల్పనే లక్ష్యాలుగా పెద్ద ఎత్తున జిల్లాల్లో ఆహారశుద్ధి పరిశ్రమలను నెలకొల్పాలని నిర్ణయించింది. ఈ పరిశ్రమల బాధ్యతను స్వయం సహాయక సంఘాలకు అప్పగించాలని భావిస్తున్న సర్కారు...అందుకు అవసరమైన భూములను అన్వేషించాలని మూడు జిల్లాల అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్ (టీజీఐఐసీ) ఆధ్వర్యంలోనే ఈ క్రతువు కొనసాగనుంది. సుమారు 300 ఎకరాల నుంచి 400 ఎకరాల వరకు ఒకే చోట ఈ పరిశ్రమలను నెలకొల్పాలని అధికారులు భావిస్తున్నారు. అందుకోసం నల్గొండతో పాటు సూర్యాపేట, యాదాద్రి జిల్లాల్లో అంత పెద్ద మొత్తంలో ప్రభుత్వ భూములు ఎక్కడున్నాయో ఉన్నతాధికారులు రికార్డులు పరిశీలిస్తున్నట్లు తెలిసింది. తొలి దశలో 200 ఎకరాల వరకు భూములను సేకరించి పలు జాతీయ, అంతర్జాతీయ సంస్థలను ఆహ్వానించి పరిశ్రమలను ఏర్పాటు చేసి, అనంతరం దశల వారీగా వాటిని విస్తరించనున్నారు. ప్రకృతి వైపరీత్యాలతో పాటు అతివృష్టి, అనావృష్టిల వల్ల రైతులకు కలుగుతున్న నష్టాన్ని ఈ ఆహారశుద్ధి రంగం ద్వారా భర్తీ చేసేలా చర్యలు తీసుకోవాలని ఇప్పటికే ఉన్నతాధికారులు సంబంధిత వ్యవసాయ శాఖకు సూచించారు. దీంతో ఏఏ ప్రాంతంలో ఏ పరిశ్రమలను పెట్టాలనేది ఇప్పటికే క్షేత్రస్థాయిలో నిర్వహించిన సర్వేలతో నిర్ణయించారు. ఈ నెలాఖరులోగా భూముల అన్వేషణను ఓ కొలిక్కి తీసుకురావాలని భావిస్తున్నారు.నల్గొండలో బత్తాయి, సూర్యాపేటలో కూరగాయలు, యాదాద్రి జిల్లాలో పాడి ఉత్పత్తులు

స్థానిక పరిస్థితులు, పంటల సాగును బట్టి నల్గొండలో బత్తాయి, సూర్యాపేటలో కూరగాయలు, యాదాద్రిలో పాడి ఉత్పత్తులకు సంబంధించిన పరిశ్రమలను ఏర్పాటు చేస్తే రైతులతో పాటు పరిశ్రమల ఏర్పాటు బాధ్యత చూసే మహిళా స్వయం సహాయక సంఘాలకు మేలు కలుగుతుందని వ్యవసాయ, ఉద్యానశాఖలు ఇప్పటికే ప్రభుత్వానికి ఓ నివేదిక సమర్పించాయి. దీనిని బట్టి పరిశ్రమల ఏర్పాటుకు పలు ఆయా రంగాల్లో పేరుపొందిన సంస్థలను ఆహ్వానిస్తారు. మరోవైపు మహిళా సంఘాలకు సైతం మండల కేంద్రాల్లో శిక్షణ ఇచ్చి... పరిశ్రమల ఏర్పాటుకు వారే ముందుకు వస్తే అందుకు తగిన రుణ సదుపాయం బ్యాంకుల ద్వారా ప్రభుత్వమే కల్పించనుంది. ఒకప్పుడు రాష్ట్రంలోనే అత్యధికంగా సుమారు లక్షన్నర ఎకరాల్లో బత్తాయి తోటలను సాగు చేసిన రైతులు రానురానూ ఆ తోటల సాగుకు ఆసక్తి చూపడం లేదు. సాగునీటి సౌకర్యం రావడం, తోటలకు చీడపీడలు సోకడం, మార్కెటింగ్ ఇబ్బందులు, తదితర కారణాలతో ప్రస్తుతం అది 30 వేల ఎకరాలకు పడిపోయింది. పెట్టుబడీ ఎక్కువ పెడుతుండటం, గతంలో వచ్చిన లాభాలు ప్రస్తుతం రాకపోవడంతో అన్నదాతలు బత్తాయి తోటల సాగువైపు కాకుండా వరి సాగుకే మొగ్గు చూపుతున్నారు. దేవరకొండ లాంటి ఏజెన్సీ ప్రాంతాల్లోనూ గతంలో భారీగా సాగైన వేరుసెనగ ఇప్పుడు సగానికి సగం పడిపోతోంది. తుంగతుర్తి, నకిరేకల్, ఆలేరు లాంటి ప్రాంతాల్లో సాగయ్యే పెసర, మినుములు మునుగోడులో సాగయ్యే కందులు ఇప్పుడు కనుమరుగవుతున్నాయి.

# శునకం.. నియంత్రణ కనం



నల్గొండ : ఉమ్మడి నల్గొండ జిల్లాలోని పురపాలికల్లో కుక్కల సంతతి నియంత్రణ చర్యలపై అధికారులు దృష్టిసారించడం లేదు. దీంతో శునకాల సంతతి పెరిగి.. వీధుల్లో ఆహారాన్వేషణకు వెళ్తూ ఎదురుపడిన ఒంటరి మహిళలు, వృద్ధులు, చిన్నారులపై దాడులు చేస్తున్నాయి. ఓ వైపు శునకాల దాడులు పెరుగుతున్నా.. పాలకులు, అధికారులు మాత్రం జీవాల నియంత్రణ శస్త్రచికిత్సలు మాత్రం జరిపించడం లేదు.నార్కట్‌పల్లిలో పదిహేను రోజుల క్రితం పెంపుడు కుక్క ఓ వ్యక్తిపై దాడిచేసి ఎడమకాలిపై తీవ్రంగా కరిచింది. వీధి శునకాల్లే కాదు.. పెంపుడు శునకాలు కూడా ఇలా దాడులు చేస్తుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

పురపాలికల్లో ఇదీ పరిస్థితి

సూర్యాపేట పురపాలికలోని కుక్కల సంతతి నియంత్రణ కేంద్రంలో శస్త్రచికిత్సలు చేస్తున్నారు. సూర్యాపేటలో 1624 కుక్కలుండగా వాటిలో 943 శునకాలను పట్టుకొని చికిత్స చేయించారు. జిల్లాలోని ఇతర పురపాలికల్లో కుక్కలను పట్టుకొని సూర్యాపేటకు తీసుకురావాల్సి ఉంది. ఒక్క శునకం చికిత్సకు రూ.2వేల వరకు ఖర్చు అవుతుండటం, రవాణా భారం ఇబ్బందిగా మారిందని పుర అధికారులు చెబుతున్నారు. భువనగిరిలోని కుక్కల నియంత్రణ కేంద్రం ఉంది. ఆలేరులో కలెక్టరేట్ ఆదేశాల మేరకు వారంలో ఓ సంస్థతో ఒప్పందం చేసుకోనున్నారు. యాదగిరిగుట్టలో ఓ సంస్థతో చేసుకున్న ఒప్పందం ప్రకారం చర్యలు చేపట్టనున్నట్లు పుర అధికారులు తెలిపారు.

నల్గొండలోని కేంద్రంలో ఇప్పటి వరకు 3000 శునకాలకు శస్త్రచికిత్సలు చేశారు. మిర్యాలగూడలో చికిత్స ప్రక్రియ ప్రారంభించలేదు. హాలియాలో శస్త్రచికిత్స చేయించేందుకు ఓ సంస్థతో ఒప్పందం చేసుకున్నారు. త్వరలో చర్యలు చేపట్టనున్నారు. చిట్యాలలో స్వతంత్ర యానియల్ వెల్ఫేర్ సొసైటీతో వారంలో ఎంవోయూ కుదుర్చుకునే అవకాశం ఉంది.

చర్యలు తీసుకుంటున్నాం

శ్రీనివాస్, పుర కమిషనర్, సూర్యాపేట: శునకాలు ఎక్కువగా ఉన్న వార్డుల్లో సిబ్బందితో పట్టించి జమునానగర్‌లోని నియంత్రణ కేంద్రంలో పశువైద్యాధికారితో చికిత్సలు చేయిస్తున్నాం.ఇప్పటి వరకు 943 కుక్కలకు చికిత్సలు చేయించాం. మళ్లీ వార్డుల్లోని శునకాలను పట్టించి కేంద్రానికి తరలిస్తాం.

గత జులై 26న సూర్యాపేటలోని శ్రీరాంనగర్ బ్రాహ్మణ కల్యాణ మండపం పరిధిలో బయటకు వెళ్లిన బాలుడిపై కుక్కలు దాడిచేసి ఎడమ చేయిని తీవ్రంగా గాయపరిచాయి.

# పల్లెపాలనకు అప్పులు!

కౌటాల : జిల్లాలోని ఓ మేజర్ గ్రామ పంచాయతీలో నాలుగు వేల పైచిలుకు జనాభా ఉంది. సర్పంచుల పదవీకాలం ముగిసిన తరువాత ఫిబ్రవరి 2వ తేదీ నుంచి అన్ని పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. అప్పటి నుంచి ఇప్పటి వరకు గ్రామంలో మోటార్ల మరమ్మతులు, బ్లీచింగ్ కొనుగోలు, వీధి దీపాల ఏర్పాట్లు, గ్రామంలో చెత్త సేకరణ ఇలా.. వివిధ పనుల కోసం ఆరు నెలల వ్యవధిలో రూ.3 లక్షల పైచిలుకు ఖర్చయింది. ఈ మొత్తంలో ఒక్క రూపాయి కూడా ప్రభుత్వం నుంచి రాలేదు. పంచాయతీలో పనిచేసే పంచాయతీ కార్యదర్శి సొంతంగా సదరు మొత్తం అప్పుచేసి గ్రామంలో పనులు చేపట్టారు. ఇదీ జిల్లాలోని పంచాయతీ కార్యదర్శుల పరిస్థితి..దేశానికి పట్టుకొమ్మలు.. అన్న గాంధీజీ మాటలను ఆయా ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయనే విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ఏటా పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక సంఘం, ఫైనాన్స్ కమిషన్ నుంచి నిధులు విడుదల చేస్తుంటాయి. దీంతోపాటు గ్రామాలే సొంతంగా ఇంటి పన్నులు, ఇతర వసూళ్లతో నిధులు సమకూర్చుకుంటుంటాయి. అయితే పెద్ద పంచాయతీల్లో ఒకరకంగా, చిన్నవాటిల్లో పూర్తిభిన్నంగా ఉంటుంటాయి. 500 జనాభా ఉన్న తండాలను గత ప్రభుత్వం పంచాయతీలుగా మార్చిన నేపథ్యంలో.. అవి నిధుల కోసం తండ్లాడుతున్నాయి. గతేడాది చివరలో జరిగిన శాసనసభ ఎన్నికల ముందునుంచే రాష్ట్ర నిధులు ఆగిపోవడం, కేంద్ర నిధులు కూడా వెనుకా ముందు వస్తుండటంతో.. పంచాయతీల్లో పాలకవర్గాలు చివరలో అత్యవసర పనులకు సర్పంచులు అప్పులు తెచ్చి మరీ పనులు చేపట్టారు. ఫిబ్రవరి 2వ తేదీతో సర్పంచుల పదవీకాలం ముగిసింది. దీంతో ప్రభుత్వం ప్రత్యేకాధికారుల పాలనను అమలులోకి తెచ్చింది. అధికారంలోకి వచ్చిన కొత్త ప్రభుత్వం ఇప్పటి వరకు పైసా నిధులు విడుదల చేయలేదు. గతంలో సర్పంచులు ఉండటంతో.. వారే అన్నీ చూసుకునే వారు. ప్రస్తుతం కార్యదర్శుల పైనే ఆ భారం పడింది.

జిల్లాలోని పలువురు పంచాయతీ కార్యదర్శులు పాలన నిర్వహించేందుకు అప్పుల ఊబిలో కూరుకుపోవాల్సిన పరిస్థితి నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి నిధులు మంజూరు కాకపోవడంతో వారే సొంతంగా గ్రామాల్లోని ఆయా పనులకు డబ్బులు ఖర్చు చేస్తున్నారు. పంచాయతీల నిర్వహణ, మరమ్మతులు, ట్రాక్టర్ డీజిల్, బ్లీచింగ్, వీధి దీపాల ఏర్పాట్లు, తదితర వాటికి అప్పులు చేసి కొనసాగిస్తున్నారు. దీంతో కార్యదర్శులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

రూ.15 కోట్ల వరకు

జిల్లాలోని చిన్న గ్రామ పంచాయతీల్లో ఒక్కో పంచాయతీ కార్యదర్శి ఆరు నెలల వ్యవధిలో రూ.50 వేల వరకు ఖర్చుచేయగా.. మేజర్ పంచాయతీలలో కార్యదర్శులు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల పైచిలుకు అప్పులు చేసి పంచాయతీల పనులకు ఖర్చుచేశారు. మొత్తంగా చూస్తే 335 పంచాయతీల్లో దాదాపుగా రూ.15 కోట్ల వరకు నిర్వహణకు ఖర్చు చేసినట్లు తెలుస్తోంది.

నిధుల కొరతపై నివేదించాం

భిక్షపతిగౌడ్, జిల్లా పంచాయతీ అధికారి

గ్రామ పంచాయతీలకు నిధుల కొరత ఉన్న మాట వాస్తవమే. అత్యవసర పరిస్థితుల్లో కార్యదర్శులే సొంతంగా డబ్బులు పెట్టుకోవాల్సిన పరిస్థితి ఉంది. ఈ విషయంపై జిల్లా యంత్రాంగానికి నివేదించాం. నిధులు మంజూరైతే ఇబ్బందులు తొలగుతాయి.

గ్రామ పంచాయతీలు – 335

పంచాయతీ కార్యదర్శులు – 240

ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు – 63

# మహిళా ఓటర్లే అధికం

ఆలేరు : స్థానిక సంస్థల ఎన్నికలకు ఓటరు ముసాయిదా జాబితా విడుదలైంది. జిల్లాలో మొత్తం 5,20,297 మంది ఓటర్లు ఉన్నారు. 17 మండలాలు ఉండగా 12 మండలాల్లో మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. జిల్లాలో 421 పంచాయతీలు ఉండగా కొత్తగా ఏర్పడిన ఏడు పంచాయతీలతో మొత్తం పంచాయతీల సంఖ్య 428కి చేరింది. ఇందులో 426 పంచాయతీలకు సంబంధించి ఓటరు జాబితా ముసాయిదాను శుక్రవారం జిల్లా పాలనాధికారి హన్మంతు కే.జెండగే విడుదల చేయగా.. మరో కొత్త పంచాయతీలుగా ఏర్పడిన గుర్జవానికుంట, ఇందిరానగర్ పంచాయతీలకు సంబంధించి సాంకేతిక కారణాలతో ముసాయిదా జాబితా విడుదల చేయలేదు. ఒకటి, రెండు రోజుల్లో ఈ రెండు పంచాయతీల ముసాయిదా జాబితాలను ప్రకటించడం జరుగుతుందని అధికారులు చెబుతున్నారు.

అయిదు మండలాల్లోజిల్లాలో మొత్తం 5,20,297 మంది ఓటర్లు ఉండగా.. పురుషులు 2,59,167, మహిళలు 2,61,127 మంది, ఇతరులు ముగ్గురు ఉన్నారు. ఆలేరు మండలంలో 442, అడ్డగూడూరులో 316, మోత్కూరు 141 భువనగిరి 460, బీబీనగర్ 229, బొమ్మలరామారం 182, వలిగొండ 202, యాదగిరిగుట్ట 213, చౌటుప్పల్ 262, మోటకొండూరు 34, రాజపేట 215, తుర్కపల్లి మండలంలో 203 చొప్పున మహిళా ఓటర్లు పురుష ఓటర్ల కన్నా అధికంగా ఉన్నారు. మిగతా రామన్నపేట, ఆత్మకూరు, పోచంపల్లి, గుండాల, నారాయణపురం మండలాల్లో మాత్రం పురుష ఓటర్లు అధికంగా ఉన్నారు.

# ఏటా ముంపు.. మిగిలిపోతున్న అప్పు

బెజ్జూరు : రైతులు కోటి ఆశలు పెట్టుకుని ఆరుగాలం కష్టపడి పంటలు సాగు చేస్తుండగా లాభాలు రాకపోగా ఏటా అప్పులే మిగులుతున్నాయి. బెజ్జూరు మండలం సోమిని, పాపన్‌పేట్, తలాయి, తిక్కపల్లి, మొగవెల్లి, తిక్కపల్లి, పాతసోమిని తదితర గ్రామాల సరిహద్దులోని సాగు చేసిన పంటలు ఏటా పెద్దవాగు, ప్రాణహిత నది ముంపునకు గురవుతున్నాయి. మహారాష్ట్ర ఎగువ ప్రాంతంలో ప్రాజెక్టుల గేట్లను ఎత్తడంతో ప్రాణహిత, పెద్దవాగు పొంగి ఆ వరదకు పంటలు నీట మునుగుతున్నాయి. జులైలో కురిసిన భారీ వర్షాలు, వరదలు, వాగులు, ఒర్రెలు పొంగడంతో వివిధ పంటలు నీట మునగ్గా పత్తి మాత్రం పూర్తిస్థాయిలో తుడుచుకుపోయింది. మరోసారి తాజాగా ప్రాణహిత తీరంలోని పంటలు నీటి మునిగాయి. దీంతో రైతులకు రూ.లక్షల చొప్పున నష్టం వాటిల్లింది. వ్యాపారుల నుంచి ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారక మందులు అరువు తీసుకొచ్చి వ్యవసాయానికి పెట్టుబడులు పెడితే.. ఏటా వరద పాలు కావడంతో అప్పులే మిగులుతున్నాయని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జులై, సెప్టెంబర్‌లో నష్టం..

ప్రాణహిత, పెద్దవాగు పరివాహక ప్రాంతంలో సాగు చేసిన పంటలకు తీవ్రస్థాయిలో నష్టం వాటిల్లింది. వానాకాలం ప్రారంభంలో సాగు చేసిన పత్తి జులైలో వచ్చిన వరదకు తుడిచిపెట్టుకుపోయింది. కనీసం



సాగు చేసుకుంటే ఖర్చులైనా చేతికి వస్తాయని ఆశతో మళ్లీ దుక్కిదున్ని విత్తనాలు విత్తి సాగు చేసుకోగా శుక్రవారం ఎగువ ప్రాంతంలో ప్రాజెక్టుల గేట్లు ఎత్తడంతో రెండోసారి వరదకు ప్రాణహిత తీరంలో పంటలు నీట మునిగాయి. జులైలో 1500ల ఎకరాల్లో నష్టపోయినట్లు అధికారులు అంచనా వేశారు. ఈ సారి 300 ఎకరాలకు పైగా వరదకు ముంపునకు గురైందని స్థానికులు అంచనా వేస్తున్నారు.

సర్వేలకే పరిమితం ఏటా ప్రాణహిత వరదకు పంటలు నష్టపోతున్నాయి. అధికారులు సర్వేలు చేసి అంచనాలు వేస్తున్నారే తప్ప పరిహారం ఇచ్చిన దాఖలాలు లేవు. వరద ముంచేయడంతో రైతులకు అప్పులే మిగులుతున్నాయి. అధికారులు స్పందించి పంటలకు నష్టపరిహారం చెల్లించి రైతాంగాన్ని ఆదుకోవాలి.

ఆత్రం సాయి, సోమిని అయిదు ఎకరాల్లో పత్తి పంట సాగు చేశా. జులైలో భారీ వరదలకు పత్తి మొక్కలపై బురద వేసింది. రూ.50 వేలకు పైగా నష్టం వాటిల్లింది. మళ్లీ దున్ని పత్తి పంటను సాగు చేశాం. వరద ముంచడంతో 2 ఎకరాల వరకు నష్టపోయా.

– గావుడు బిచ్చు, తలాయి

ప్రతిపాదనలు పంపించాం

ప్రాణహితనది, పెద్దవాగు పరీవాహకంలో నష్టపోయిన పంటలపై ప్రాథమిక అంచనాలు తయారు చేసి ప్రతిపాదనలు పంపించాం. త్వరలోనే నష్టపరిహారం మంజూరు అవుతంది.

– శ్రీనివాస్, జిల్లా వ్యవసాయాధికారి

రెండు సార్లు వరద ముంచింది

నాకున్న 5 ఎకరాల్లో పత్తి సాగు చేయగా జులైలో భారీ వర్షాలు, వరదల కారణంగా మొత్తం పంట నష్టపోయా. మళ్లీ దున్ని సాగు చేశాం. ఈసారి మహారాష్ట్రలో ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో మూడు ఎకరాలకు పంట నష్టం వాటిల్లింది. నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలి. పోర్తేటి ప్రేమ్‌సాగర్, సోమిని

# సిరిపురానికి 'సౌర'భం

మధిర: మధిర మండలంలోని సిరిపురం గ్రామమంతా సౌర కాంతులు విరజిమ్మనున్నాయి. మధిర ఎమ్మెల్యే, ఉపముఖ్యమంత్రి, విద్యుత్తుశాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క చొరవతో గ్రామానికి తొలి అవకాశం దక్కనుంది. ఈ మేరకు హైదరాబాద్‌లోని ఎస్పీడీసీఎల్ కార్యాలయంలో హరిత ఇంధన ఉత్పత్తి పెంపుదల వివిధ వర్గాలకు ఆదాయం సమకూర్చడంపై రెడ్‌కో, ఎస్పీడీసీఎల్ అధికారులతో భట్టి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. రైతులకు పంటల ద్వారానే కాకుండా సోలార్ విద్యుత్తు నుంచి ఆదాయం సమకూరేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో 22గ్రామాలను తొలిదశలో పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసుకుని రైతుల వ్యవసాయ పంపుసెట్లతోపాటు



అన్ని ఇళ్లకు సంపూర్ణంగా ప్రభుత్వ ఖర్చులతో సౌరవిద్యుత్తు ఫలకాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు మధిర నియోజకవర్గంలోని సిరిపురం గ్రామాన్ని ఎంపిక చేసింది.

విద్యుత్తు సంస్థ సర్వే పూర్తి

వారం రోజుల కిందట విద్యుత్తు సంస్థ అధికారులు సిరిపురం గ్రామంలో ఇంటింటికీ తిరిగి ఏడీఈ అనురాధ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. కిలో వాట్ సౌర విద్యుత్తు ఏర్పాటుకు అనువైన ఇళ్లను గుర్తించారు. ఇదే విధంగా 5కిలో వాట్ సౌరవిద్యుత్తు ఏర్పాటుకు అనువైన వ్యవసాయ కనెక్షన్లు సర్వే చేశారు. సర్వే నివేదికను వరంగల్‌లోని సీఎండీ కార్యాలయానికి పంపారు. ఇళ్లు, వ్యవసాయ మోటార్లు వద్ద తయారైన విద్యుత్తును గ్రిడ్‌కు అనుసంధానిస్తారు. అక్కడి నుంచి విద్యుత్తు సబ్‌స్టేషన్ల ద్వారా ఇళ్లకు, వ్యవసాయ మోటార్లకు బైడైరక్షన్ మీటర్లు అమర్చి విద్యుత్తు సరఫరా చేస్తారు. ఆరు నెలలకోసారి విద్యుత్తు రీడింగ్‌లను సరిచూసి తయారైన సౌరవిద్యుత్తు మిగులుబడి ఉంటే ఆ సొమ్మును సంబంధిత యజమాని బ్యాంకు ఖాతాలో జమచేస్తారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సిరిపురంలో సర్వే నిర్వహించి నివేదికను పంపినట్లు ఏడీఈ అనురాధ తెలిపారు.

# మెట్రో పనులకు వీడని చిక్కుముడి

హైదరాబాద్ : పాతబస్తీ మెట్రోరైలు పనులకు సంబంధించి భూసేకరణ పూర్తి చేసేందుకు 8నెలలు పడుతుందని మెట్రోరైలు అధికారులు తెలిపారు. సేకరణ పూర్తికాగానే పనులు మొదలవుతాయా అంటే.. అంతకంటే ముందు కొన్ని చిక్కుముడులు వీడాల్సి ఉంటుంది. ఒప్పందం ప్రకారమే.. ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు 5.5 కి.మీ. వరకు మెట్రోరైలు మొదటి దశలోని భాగం. ఈ మార్గాన్ని పీపీపీలో ప్రాజెక్ట్ దక్కించుకున్న ఎల్అండ్‌టీ హైదరాబాద్ మెట్రోరైలు సంస్థ పూర్తి చేయాల్సి ఉంటుంది. ఈ మేరకు ప్రభుత్వంతో ఒప్పందం కూడా ఉంది. అయితే అలైన్‌మెంట్ వివాదాలతో ఈ స్వల్ప దూరం పనులు చేపట్టకుండానే మిగిలిన మార్గాలను సదరు సంస్థ పూర్తి



చేసింది. ఒప్పందం ప్రకారం ఎల్అండ్‌టీ హైదరాబాద్ మెట్రోరైలు సంస్థనే చేపట్టాలని.. చేయకపోతే న్యాయమైన చర్యలుంటాయని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ వివాదం తేలితే తప్ప పనులు మొదలయ్యేలా లేవు.సర్దుబాటు వ్యయ నిధి నిలిపివేత.. ఒప్పందం మేరకు పాతబస్తీ పనులు పూర్తి చేయకపోవడంతో కేంద్రం ఇచ్చే సర్దుబాటు వ్యయ నిధిలో కొంత నిలిపేసింది. రూ.1,456 కోట్ల సర్దుబాటు నిధి కేంద్రం నుంచి ఎల్అండ్‌టీ మెట్రో సంస్థకు అందాల్సి ఉండగా..రూ.1,200 కోట్లు మాత్రమే వచ్చాయి. ఎంజీబీఎస్- ఫలక్‌నుమా మార్గం పెండింగ్‌లో పెట్టడంతో రూ.256 కోట్లను నిలుపుదల చేసింది.

# బృహత్ ప్రణాళికపై కదలిక

మల్యాల : రాష్ట్రంలోనే ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విలసిల్లుతున్న కొండగట్టు ఆంజనేయస్వామి క్షేత్రంలో బృహత్ ప్రణాళిక అమలుకు అధికారులు నిర్ణయించారు. జగిత్యాల జిల్లా మల్యాల మండలం ముత్యంపేట పరిధిలోని కొండగట్టు అంజన్న ఆలయ పరిధిలో మాస్టర్‌ప్లాన్ అమలు చేయాలని దాదాపు 25 ఏళ్లుగా అధికారులు, నాయకులు ప్రతిపాదనలు చేస్తున్నా అమలుకు నోచుకోవడం లేదు. హైదరాబాద్‌లోని దేవాదాయశాఖ ప్రధాన కార్యాలయంలో దేవాదాయ కమిషనరు ఆదేశాల మేరకు మాస్టర్‌ప్లాన్ కమిటీ ప్రప్రథమంగా సమావేశం కావడంతో మొదటి అడుగు పడినట్లయింది. కమిటీలో హైదరాబాద్ దేవాదాయ ధర్మాదాయశాఖ చీఫ్ ఇంజినీరు, అదనపు కమిషనరు, సూపరింటెండెంటు ఇంజినీరు, స్తపతి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు, రాజరాజేశ్వరస్వామి ఆలయ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు, కొండగట్టు ఆలయ కార్యనిర్వహణ అధికారి, ఆలయ ప్రధాన అర్చకులు సభ్యులుగా ఉన్నారు.

కొండపైన ప్రధాన సమస్యలు

దాదాపు 22 ఎకరాల విస్తీర్ణంలోని అంజన్న ఆలయ పరిసరాల్లో భక్తుల కోసం దాదాపు 70 గదులు, మూడు డార్మిటరీ షెడ్లు, మూడు గెస్ట్‌హౌజ్‌లు ఉన్నాయి. అంజన్న ఆలయం వెనుకవైపున భేతాళుడి గుడి, ఆలయానికి వెళ్లే దారి పక్కన రామాలయం ఉన్నాయి. కొండపైన వాహనాలు నిలిపేందుకు సరైన ప్రదేశంలేదు. ధర్మశాల గదుల్లో నీటి వసతి, సౌకర్యాలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. దీక్షాపరులు మాల విరమణ చేయడానికి రూ.2.5 కోట్లతో ఆరేళ్ల కిందట మాల విరమణ మండప నిర్మాణానికి శంకుస్థాపన చేసినప్పటికీ పనులు పునాదుల స్థాయిలోనే నిలిచిపోవడంతో పిల్లర్ల కోసం వేసిన ఇనుము తుప్పు పడుతోంది. స్వామివారి దర్శనం కోసం నిత్యం వేలాది మంది భక్తులు తరలివచ్చి ఒక్క రోజు ఆలయ సన్నిధిలో బస చేయడానికి గదులు లభించక ఆరుబయటే సేదతీరి వెళ్తుంటారు. ఆలయ పరిసరాల్లో మరుగుదొడ్లు, మూత్రశాలలు ఉన్నప్పటికీ నిర్వహణ సరిగాలేక ఆలయ పరిసరాలు దుర్గంధంగా మారుతున్నాయి. అంజన్న పేరిట దాదాపు 650 ఎకరాల భూములు ఉన్నప్పటికీ గదుల నిర్మాణం, పార్కింగు సమస్య తీరడంలేదు. తాగునీరు, పుష్కరిణలోకి నిరంతర నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాల్సి ఉంది. భక్తుల కోసం కనీసం 200 గదులు, డార్మిటరీ షెడ్ల నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ఆరేళ్ల కిందట శంకుస్థాపన చేసిన మెట్లదారి నిర్మాణం ఊసేలేదు. శిథిలావస్థలో ఉన్న రామాలయం నిర్మించాల్సి ఉంది.

ఏజెన్సీ ద్వారా పనులు

ఆలయ పరిసరాల్లో బృహత్‌ప్రణాళిక అమలుకు 8 మంది సభ్యులతో జనవరిలోనే మాస్టర్‌ప్లాన్ కమిటీ ఏర్పాటైనప్పటికీ ఎలాంటి కదలిక కనిపించలేదు. మొదటిసారిగా దేవాదాయశాఖ ప్రధాన కార్యాలయంలో సమావేశమై 'ఈ ప్రొక్యూర్‌మెంటు' ద్వారా బృహత్ ప్రణాళిక అమలుకు ప్రత్యేక ఏజెన్సీని గుర్తించడానికి నిర్ణయించినట్లు అధికారులు వెల్లడించారు. కమిటీ సభ్యుల సూచనల మేరకు కొండపైన చేపట్టాల్సిన అభివృద్ధి పనులను గుర్తించి ఏజెన్సీ ద్వారా పూర్తి చేయనున్నట్లు ఈవో రామకృష్ణారావు తెలిపారు.

## బ్యారేజీ ప్రతిపాదన కాగితాలకే పరిమితం

ధర్మపురి : గోదావరిలో వృథా జలాలకు అడ్డుకట్ట వేసేందుకు బ్యారేజీ నిర్మించాలనే ప్రతిపాదనలకు కార్యరూపం దాల్చడం లేదు. గతేడాది ఇరిగేషన్ అధికారులు సర్వే చేసి ప్రభుత్వానికి నివేదించారు. ఈ నివేదిక ఆధారంగా బ్యారేజీ నిర్మించినట్లయితే ధర్మపురికి బహుళ ప్రయోజనం చేకూరుతుందని పట్టణ వాసులు భావిస్తున్నారు. ప్రభుత్వం ఈ దిశగా అడుగులు వేయాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు. ధర్మపురి ఎగువ ప్రాంతంలో ఉన్న దమ్మన్నపేట, రాజారం, జైన ప్రాంతాల్లో గోదావరిపై బ్యారేజీ నిర్మాణం చేయాలనే ప్రతిపాదన ఏళ్ల తరబడి ఉంటోంది. భవిష్యత్తు అవసరాలకు తాగు, సాగు నీటి సరఫరాతోపాటు పుణ్య స్నానాలకు జలాలు అందుబాటులో ఉంటాయని భావిస్తున్నారు. ఇటీవల బ్యారేజీ నిర్మించాలని అధికారులు ప్రతిపాదించారు. దమ్మన్నపేట-జైన మధ్య నిర్మాణానికి అనువుగా ఉంటుందని అధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. ఇప్పటికే డ్రోన్ ద్వారా సర్వే చేసినా.. మరోమారు క్షుణ్ణంగా సర్వే చేయాల్సిన అవసరముందని సమాచారం.బహుళ ప్రయోజనం ఇలా..ధర్మపురి ఎగువ ప్రాంతంలో బ్యారేజీ నిర్మించినట్లయితే సాగు, తాగు నీటి సమస్యలు తీరనున్నాయి. ప్రధాన పండుగుల సందర్భంగా భక్తులకు నీటి ఎద్దడి సమస్యలు పరిష్కారమవుతాయని భావిస్తున్నారు. ముఖ్యంగా ధర్మపురి గోదావరిలో పుణ్య స్నానాలు చేసేందుకు భక్తులు సుదూర ప్రాంతాల నుంచి పెద్దఎత్తున తరలి వస్తున్నారు. మరోవైపు ఇక్కడి బ్రహ్మోత్సవాలు వేసవికి ముందు జరుగుతాయి. ఈ సమయంలో స్నానాలకు ఇబ్బందులు ఎదురవు తు న్నాయి. బ్యారేజీ నిర్మాణం పూర్తయితే అవసరమైన స్థలాల్లో నీటిని వదులుకునే వీలుంటుంది. దీనిపై ఎస్సారెస్పీ డీఈ నారాయణరెడ్డిని సంప్రదించగా.. గత ప్రభుత్వ ఆదేశాల మేరకు తాము సర్వే చేసి నివేదికలను ప్రభుత్వానికి సమర్పించా మన్నారు. ఈలోగా ఎన్నికలు రావడంతో ముందుకు సాగలేదన్నారు.

# ఎల్ఆర్'ఎస్' అంటారో.. లేదో..?



హైదరాబాద్:శంషాబాద్, మణికొండ, నార్సింగి, పెద్దఅంబర్‌పేట, తుర్కయాంజాల్, ఇబ్రహీంపట్నం, తుక్కుగూడ మున్సిపాలిటీలు, మేడ్చల్ జిల్లాలో తూంకుంట, మేడ్చల్, గుండ్లపోచంపల్లి, పోచారం, ఘట్‌కేసర్ మున్సిపాలిటీలు, పీర్జాదిగూడ, బోడుప్పల్ కార్పొరేషన్ల పరిధుల్లోని దరఖాస్తుల్లో పదిశాతం నుంచి 15 శాతం ఇలాంటివి ఉన్నట్టు గుర్తించారు.భూముల క్రమబద్ధీకరణ దరఖాస్తులపై హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల రెవెన్యూ, మున్సిపాలిటీల అధికారులు కొత్త నిర్ణయం తీసుకున్నారు. దరఖాస్తుల్లో కొన్ని చెరువుల బఫర్ జోన్లు ఉన్నాయన్న అనుమానాలు రావడంతో రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్ అధికారులు క్షేత్రస్థాయిలో భూములను పరిశీలించనున్నారు. జియో మ్యాపింగ్ సరిహద్దులు, హెచ్ఎండీఏ వెబ్‌సైట్‌లోని చెరువుల ప్రాథమిక నోటిఫికేషన్, తుది నోటిఫికేషన్లను పరిగణలోకి తీసుకుంటున్నారు. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లు ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల్లో ఉంటే వాటిని వెంటనే తిరస్కరించనున్నారు.

హైడ్రా ప్రభావం..

క్రమబద్ధీకరణ దరఖాస్తుల పరిష్కార బాధ్యతను ప్రభుత్వం స్థానిక సంస్థలను పర్యవేక్షించే అదనపు కలెక్టర్లకు అప్పగించింది. వీటిని మూడంచెల్లో(ఎల్-1, ఎల్-2, ఎల్-3) పరిష్కరించాలంటూ ప్రభుత్వం మార్గదర్శకాలను జారీ చేసింది. దరఖాస్తులను పరిశీలించాక అధికారులు ఆమోదించేలా ఒక యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. గతంలో దరఖాస్తులను ఇరిగేషన్, రెవెన్యూ అధికారుల సూచనల అధారంగా మున్సిపల్ అధికారులు పరిష్కరించారు. హైడ్రా ఏర్పాటుతో క్షేత్రస్థాయిలో పరిశీలించి చెరువుల సరిహద్దులు, బఫర్ జోన్లను నిర్ధరించి దరఖాస్తుదారు పేర్కొన్న సర్వే నంబరు విస్తీర్ణం బఫర్ జోన్‌లోకి వస్తుందా? ఎంత ఆ జోన్‌లో కొంత స్థలాన్ని ఆక్రమించారా? అన్న అంశాలను తేల్చనున్నారు. గ్రామ పరిధిలోని నక్ష, సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన జీడీపీఎస్‌లతో సర్వే నిర్వహించనున్నారు.

కొత్తగా చేసుకున్నాకే...

ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధుల్లో క్రమబద్ధీకరణ దరఖాస్తులుంటే ప్రాథమిక దశ(ఎల్-1)లోనే అధికారులు తిరస్కరిస్తారు. దరఖాస్తుదారులకు సంక్షిప్త సందేశాలు, ఫోన్లు, ఈ-మెయిల్ ద్వారా తెలపనున్నారు.

బఫర్ జోన్‌లో ఉంటే.. ఆ పరిధి తొలగించి సర్వే చేయించుకుని కొత్త దరఖాస్తు చేసుకున్నాకే క్షేత్రస్థాయిలో రెండోసారి పరిశీలించి ఆమోద ముద్ర వేయనున్నారు.

ఎల్-2 దశలో మున్సిపల్, రెవెన్యూ అధికారులు అభ్యంతరం చేసినా తిరస్కరిస్తారు.

రంగారెడ్డి జిల్లాలో మున్సిపాలిటీలు, గ్రామాల్లో 2.16లక్షల క్రమబద్ధీకరణ దరఖాస్తులు పరిశీలనలో ఉండగా... మేడ్చల్ జిల్లాలో 40వేలకు పైగా దరఖాస్తులను పరిశీలిస్తున్నారు.

క్రమబద్ధీకరణ ప్రక్రియ పారదర్శకంగా జరిగేందుకు ముగ్గురు అధికారులను నియమించామని, దరఖాస్తుల ప్రక్రియ నిర్ణీత వ్యవధిలో పూర్తిచేసేందుకు కార్యచరణ రూపొందించామని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) ప్రతిమాసింగ్ తెలిపారు.

# యువతపై షుగర్, హైబీపీ దాడి




హైదరాబాద్: మహానగర పరిధిలోని అర్బన్, పెరి అర్బన్, శివార్లలోని గ్రామీణ ప్రాంతాల్లో మధుమేహం, అధిక రక్తపోటు దాడి చేస్తున్నట్లు తాజా అధ్యయనంలో వెల్లడైంది. 40 శాతం మందిలో మధుమేహం నియంత్రణలో లేనట్లు గుర్తించారు. ఈ ఏడాది జనవరి నుంచి రంగారెడ్డి గ్రామీణ ప్రాంతాల్లో 10,400 మందిపై నగరానికి చెందిన హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ వాలంటీర్లు ఇపరీక్షలు చేయగా.. గ్రామీణంలో 2,649 మంది మధుమేహం, అధిక రక్తపోటుతో.. నగరంలో 10 అర్బన్, పెరి అర్బన్ ప్రాంతాల్లో పరీక్షలు చేయగా.. 2570 మంది ఈ రెండు సమస్యలు ఎదుర్కొంటున్నట్లు హెచ్‌హెచ్ఎఫ్ తెలిపింది.

ఎక్కడెక్కడ సేకరణ చేశారంటే..

నగరంలో హకీంపేట్, వాది-ఇ-మహమూద్, కిషన్‌బాగ్, కాలాపత్తర్, హసన్‌నగర్, జల్‌పల్లి, బాలాపూర్, షహీన్‌నగర్, పహాడీషరీఫ్, వెంకటాపురంతోపాటు మహేశ్వరం, నాగారం, కందుకూరు, ముచ్చెర్ల తదితర శివారు గ్రామాల్లో శాంపిళ్లు సేకరించారు.

30-50 వయసు వారిలో..

గ్రామీణ యువతతో పోల్చితే అర్బన్‌లో 50 శాతం మంది ఎక్కువగా బీపీ, షుగర్ సమస్యలు ఎదుర్కొంటున్నట్లు అధ్యయనంలో గుర్తించారు. మూత్రపిండాలు, మెదడు, హృద్రోగ సమస్యలకు అధిక రక్తపోటు, మధుమేహమే కారణమవుతాయని వైద్యులు పేర్కొంటున్నారు.


మందులు కొనలేక..

ఆసుపత్రుల్లో సరిపడా మందులు ఇవ్వపోవడంతో డబ్బులు పెట్టి కొనలేక కొందరు చికిత్సలు మధ్యలోనే ఆపేస్తున్నారు. దీంతో కొన్నాళ్లకు తీవ్ర అనారోగ్య సమస్యలకు కారణమవుతున్నాయి.

జీవనశైలి మారడంతో..

గ్రామీణ ప్రాంతాల్లో జీవనశైలి మారడం, మద్యపానం, పొగతాగడం తదితర అలవాట్లతో మధుమేహం, అధిక రక్తపోటు సకాలంలో గుర్తించకలేకపోతున్నారు. దాదాపు 40 శాతం మంది మధుమేహ రోగుల్లో హెచ్‌బీఏ1సీ 7.5 ఎంజీ/డీఎల్‌గా ఉండటం ఆందోళన కలిగించే అంశం. సాధారణంగా ఈ స్థాయిలు 4-6 మధ్య ఉండాలని నిపుణులు పేర్కొంటున్నారు.

# ఆక్రమణలపై ఆరా..



వేములవాడ : ఆధ్యాత్మిక పట్టణమైన వేములవాడలోని మూలవాగు పరివాహక ప్రాంతంలో రెండు రోజులుగా మూలవాగు బఫర్‌జోన్ సర్వే పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. మూలవాగు పరివాహక ప్రాంతంలో ఏ మేరకు బఫర్ జోన్ ఉందనేది గుర్తించిన అనంతరం హద్దులు ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం నీటిపారుదల, రెవెన్యూ, సర్వే విభాగం అధికారులు సర్వే పనుల్లో నిమగ్నమయ్యారు. పట్టణంలోని మొదటి బైపాస్ రోడ్డులోని మహాలక్ష్మి వీధి ప్రాంతం నుంచి మూలవాగు వంతెన వరకు అక్కడి నుంచి రెండో బైపాస్ రోడ్డులోని బతుకమ్మ స్థలం నుంచి మాజీ ఎమ్మెల్యే ఇంటి పరివాహక ప్రాంతం మీదుగా పట్టణ పరిధిలోని మూలవాగు మొత్తం సర్వే చేసి హద్దులు నిర్ణయించనున్నారు. గతంలో బఫర్ జోన్‌ను గుర్తించి మార్కింగ్ ఇచ్చిన అధికారులు చర్యలు చేపట్టకపోవడం తీవ్ర విమర్శలకు తావిచ్చింది. వివిధ ఒత్తిళ్లతో అధికారులు వెనుకంజ వేశారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ప్రస్తుతం బఫర్ జోన్‌ను సర్వే చేస్తున్న అధికారులు ఈ సారైనా మూలవాగు పరివాహక ప్రాంతంలోని బఫర్ జోన్ ఆక్రమణలను పూర్తి స్థాయిలో తొలగింపునకు చర్యలు తీసుకొని ప్రభుత్వ స్థలాలను రక్షించి ప్రజోపయోగ అవసరాలకు వినియోగించాల్సిన అవసరం ఉందని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఇష్టారాజ్యంగా నిర్మాణాలుమూలవాగు వెంబడి ఉన్న స్థలాల యజమానులు ఇష్టారాజ్యంగా బఫర్ జోన్ స్థలాన్ని ఆక్రమించి భారీ భవనాలను నిర్మించారు. స్థలాలను ఆక్రమించి మట్టి నింపి భవనాలు నిర్మించినప్పటికీ మున్సిపల్, రెవెన్యూ, నీటిపారుదల శాఖల అధికారులు ఎవరూ పట్టించుకోలేదు. దీంతో మొదటి, రెండో బైపాస్ రహదారి మూలవాగు పరివాహక ప్రాంతంలోని బఫర్ జోన్ పూర్తిగా ఆక్రమణకు గురైంది.

మూలవాగు వెంబడి గుంట స్థలం ఉంటే మరో గుంట వరకు ఆక్రమించి నిర్మాణాలు చేశారు.గతంలో మొదటి బైపాస్ రహదారిలో రెవెన్యూ, మున్సిపల్, సర్వే అధికారులు సర్వే చేశారు.బఫర్ జోన్ 9 మీటర్లను గుర్తించి దాదాపు 40 భవనాలకు మార్కింగ్ ఇచ్చి కొన్నింటిని పాక్షికంగా తొలగించారు.

కొంత మంది భవనాల యజమానులు కోర్టుకు వెళ్లడంతో పూర్తి స్థాయిలో తొలగింపు చర్యలు చేపట్టలేదు.ప్రస్తుతం బఫర్ జోన్ సర్వే కొనసాగుతుండటంతో హైదరాబాద్‌లోని హైడ్రా తరహాలో ఆక్రమణలు తొలగించేందుకు ఇక్కడ కూడా చర్యలు చేపట్టనున్నట్లు పట్టణంలో చర్చ జరుగుతోంది.

ప్రభుత్వ ఆదేశం మేరకు చర్యలు వేములవాడ పట్టణంలోని మూలవాగు వెంబడి బఫర్ జోన్ గుర్తింపునకు సర్వే జరుగుతోంది. వాగుకు ఇరువైపుల తొమ్మిది మీటర్ల చొప్పున బఫర్‌జోన్ స్థలం ఉండాలి. సర్వే చేసి ముందుగా హద్దులు నిర్ణయిస్తాం. నివేదికను ప్రభుత్వానికి అందజేసిన తరువాత ప్రభుత్వ ఆదేశాల మేరకు తదుపరి చర్యలు చేపడతాం.

శ్రీనివాస్, నీటిపారుదల శాఖ డీఈ

# జ్వరమొచ్చింది..

కరీంనగర్ : ఉమ్మడి జిల్లాలో ఏ ఇంటి తలుపు తట్టినా ఒక్కరైనా జ్వరం బారిన పడిన వారుంటున్నారు.. ప్రభుత్వ.. ప్రైవేటు ఆస్పత్రులు ఏవి చూసినా జ్వరం, డెంగీ బాధితులతో కిటకిటలాడుతున్నాయి.. సరైన సమయంలో చికిత్స అందక మరణాలూ చోటుచేసుకుంటున్నాయి.. జ్వరమే కదా అని కొందరు సొంత వైద్యం చేసుకోవడం.. ఆర్ఎంపీల వద్ద చికిత్సలు చేయించుకోవడం.. పరిస్థితి విషమించిన తరవాత పెద్దాసుపత్రులకు వెళ్లడంతో ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారుజాగ్రత్తలతో జ్వరాలు, డెంగీ రాకుండా చూసుకోవచ్చని.. వచ్చినా సరైన వైద్యం, విశ్రాంతితో కోలుకోవచ్చని వైద్యులు చెబుతున్నారు.

జాగ్రత్తలతో నివారణ

డా.విజయ మోహన్‌రెడ్డి.ఫిజిషియన్

ప్రశ్న : జ్వరం రాగానే వైద్యుడి వద్దకు వెళ్లాలా? ప్రాథమిక చికిత్స ఏమైనా ఉందా?

జవాబు : ప్రస్తుతం జ్వరాల తీవ్రత పెరిగింది. జ్వరం రాగానే వారి వయసు, బరువు ప్రకారం పారాసిటమాల్ మాత్ర వేసుకోవడం ప్రాథమిక అవసరం. దీంతో పాటు విశ్రాంతి తీసుకోవాలి. ఒకరోజు కన్నా ఎక్కువ ఉంటే వైద్యుడి వద్దకు వెళ్లాలి.

ప్ర : జ్వరం వచ్చిన తర్వాత ఎన్ని రోజులకు ఏఏ పరీక్షలు చేయడం వల్ల ఫలితాలు పూర్తి స్థాయిలో తెలుసుకునే అవకాశం ఉంటుంది.

జ : రెండు రోజుల వరకు తగ్గకుండా ఒళ్లు నొప్పులు, శరీరంపై దద్దుర్లు రావడం, మూత్రం, మలంలో రక్తం రావడం, పళ్ల చిగుళ్ల నుంచి రక్తం వంటివి వచ్చినట్లైతే కచ్చితంగా వైద్యుడి వద్దకు వెళ్లి సీబీపీ రక్త పరీక్ష చేయించాలి. అందులో తెల్ల రక్తకణాలు, ప్లేట్‌లెట్స్ తగ్గితే మందులు వాడాలి. డెంగీకి సంబంధించి ఎలీసా పరీక్ష చేయిస్తేనే డెంగీ నిర్ధారణ అవుతుంది. అలా నిర్ధారణ కాగానే వైద్యుడి సలహా మేరకు మందులు వాడాలి. 20 వేల లోపు ప్లేట్‌లెట్స్ తగ్గిపోతే తీవ్రంగా భావించాలి. లక్షలోపు ఉన్నా వైద్యుడి పర్యవేక్షణలో ఉండాలి. జ్వరం తీవ్రంగా ఉన్నపుడు రక్తపోటు తగ్గే అవకాశం ఉంటుంది. వాంతులు అవుతాయి. ఇతర కారణాలు కూడా ఉంటాయి. వైద్యుడి పర్యవేక్షణ అవసరం.

ప్ర : ఔషధాల వాడకం ఎలా ఉండాలి?

జ : జ్వరంతో ఉన్నవారు మొదట్లో పారాసిటమాల్ మాత్ర వాడుకుంటూ పళ్ల రసాలు తీసుకోవాలి. యాంటీబయాటిక్స్ వైద్యుడి సూచన మేరకు ఉపయోగించాలి. డెంగీతో బాధ పడేవారు నొప్పి నివారణ మాత్రలు, సూదిమందు వాడొద్దు. లక్షణాలు తీవ్రంగా ఉన్నపుడు అసలు తీసుకోవద్దు. బాగా నొప్పులు ఉన్నాయని వెళ్తే కొందరు ఆర్ఎంపీలు ఇవి ఇస్తున్నారు. ఇది ప్రమాదకరం. అర్హులైన వైద్యుల సూచనలు మాత్రమే పాటించాలి.

ప్ర : వృద్ధులు, పిల్లలు, గర్భిణులు, బాలింతలు జ్వరం బారిన పడితే..?

జ : వైద్యుల పర్యవేక్షణలోనే మందులు వాడాలి. జ్వరం వచ్చిన పిల్లలను బడికి పంపించవద్దు. అతడిని కుట్టిన దోమ ఇతర పిల్లలకు కూడా కుడితే జ్వరాలు వస్తాయి. దోమ వల్ల జ్వరం వచ్చిన వారు ఇతరులకు, ముఖ్యంగా పిల్లలకు దూరంగా ఉండాలి.

ప్ర : వ్యక్తిగత, ఇంటి పరిశుభ్రత ఎలా ఉండాలి. జ్వరం బారిన పడకుండా తీసుకోవాల్సిన చర్యలు ఏమిటి?

జ : దోమలు లేకుండా అన్ని జాగ్రత్తలు పాటించాలి. జ్వరం బారిన పడ్డవారు తప్పనిసరిగా దోమ తెరలు వాడాలి. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. పరిసరాలన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలి. జ్వరం బారిన పడ్డవారు పళ్ల రసాలతోపాటు అన్నం మెత్తగా వండి ద్రవ రూపంలో తీసుకోవాలి. మాంసాహారం, వేపుళ్లు తినొద్దు. పూర్తిగా విశ్రాంతి తీసుకోవాలి.

ప్ర : జ్వరం తగ్గిన తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలు

జ : జ్వరం తగ్గిన తర్వాత వారం రోజుల పాటు విశ్రాంతి అవసరం. తేలికగా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవాలి.

ఎలీసా పరీక్షతోనే డెంగీ నిర్ధారణ

జ్వరాల విజృంభణ నేపథ్యంలో అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ప్రతి మంగళ, శుక్రవారాలలో డ్రైడే నిర్వహించడంతోపాటు ఎక్కువ మంది జ్వరాల బారిన పడిన ప్రాంతంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్నాం. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పల్లె, బస్తీ దవాఖానాల్లోనూ జ్వర నివారణకు వైద్యం అందుబాటులో ఉంది. డెంగీ పాజిటివ్ వచ్చిన వారిని కరీంనగర్ జనరల్ ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తున్నాం. జ్వరం వచ్చి ప్లేట్‌లెట్లు తగ్గాయని అనగానే డెంగీ అని భయపడొద్దు. ఎలీసా పరీక్షలో నిర్ధారణ అయితేనే డెంగీగా భావించాలి. డాక్టర్ సుజాత, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి

# కూల్చేస్తే సరి..!

సూర్యాపేట : పట్టణాలు, గ్రామాల్లో పాత భవనాలు ప్రమాదకరంగా మారుతున్నాయి. ఏళ్ల కిందట నిర్మించినవి కావటంతో శిథిలావస్థకు చేరాయి. ముసురులకు, వర్షాలకు నాని కూలిపోతున్నాయి. వాటిని కూల్చకుండా ఇంటి యజమానులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. గతేడాది నాగారం మండల కేంద్రంలో వర్షానికి మట్టి గోడలు కూలి తల్లిదండ్రులతో సహా కుమారుడు మృతిచెందారు. ఆ ఘటన మరవక ముందే ఆత్మకూర్(ఎస్) మండలం నెమ్మికల్‌లో ఇద్దరు అన్నదమ్ముళ్లపై ఇంటి పక్కన గోడ కూలింది. ప్రమాదంలో ఒకరు మృతిచెందగా.. మరొకరి పరిస్థితి విషమంగా మారింది.

ఇదీ పరిస్థితి..సూర్యాపేట, నల్గొండ, యాదాద్రి జిల్లాల్లో 19 పురపాలికలు, 1740 గ్రామ పంచాయతీలున్నాయి. పట్టణాల్లో ఏళ్ల నాటి పాత భవనాలున్నాయి. శిథిల భవనాల యజమానులకు పుర అధికారులు నోటీసులు జారీ చేస్తున్నారే తప్ప పూరిస్థాయిలో చర్యలు చేపట్టడం లేదు.

ఇటీవల కురిసిన వర్షాలకు సూర్యాపేట పట్టణంలోని రాజీవ్‌నగర్‌లో ఏళ్ల నాటి పాత ఇల్లు కూలిపోయింది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఇలాంటి ఇళ్లు ఉమ్మడి నల్గొండ జిల్లాలోని అన్ని పురపాలికల్లో, గ్రామాల్లో ఉన్నాయి. భారీ వర్షాలకు గోడలు నాని కూలే ప్రమాదం ఉంది. ఈ ఇళ్ల యజమానులకు సంబంధిత అధికారులు నోటీసులు జారీ చేసి కూల్చివేసే చర్యలు చేపట్టాల్సి ఉన్నా తమకేమిపట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

గుర్తించినా.. పట్టించుకోవటం లేదు

వానాకాలం ముందు ఉమ్మడి జిల్లాలో పాత భవనాల ఇళ్లను గుర్తించేందుకు అధికారులు ఇంటింటి సర్వే చేపట్టారు. పట్టణాలు, గ్రామాల్లో అప్రమత్తం చేసినా ఇంటి యజమానుల్లో అవగాహన కలగటం లేదు. జూన్‌లో పురలు, పట్టణాల్లో పాత భవనాలున్న వారి ఇంటింటికీ వెళ్లి నోటీసులు జారీ చేశారు. కానీ కొందరు ఇళ్ల యజమానులు మాత్రం తమకేమి పట్టనట్లు ఉండిపోయారు.

చర్యలు తీసుకుంటాం..

శ్రీనివాస్, పుర కమిషనర్, సూర్యాపేట

పురపాలికల్లో పాత ఇళ్లపై చర్యలు తీసుకుంటాం. మరోసారి యజమానులకు నోటీసులు జారీ చేస్తాం. ప్రమాదకరంగా ఉంటే ఖాళీ చేయించి కూల్చివేయిస్తాం. ఇప్పటికే జూన్‌లో సర్వే చేపట్టి ఇలాంటివి గుర్తించి అప్రమత్తం చేశాం. మరోసారి చర్యలు చేపడతాం.

# లోపాలే శాపాలు

కొత్తగూడెం : నిర్మాణ లోపాలు సింగరేణి కార్మికోద్యోగులకు శాపాలుగా మారుతున్నాయి. బొగ్గును నిల్వచేసే బంకర్ల నిర్మాణాల్లో లోపాలు బయటపడుతున్నాయి. దీనివల్ల ఉత్పత్తి దెబ్బతింటోంది. ఒక్కోసారి ప్రమాదాల్లో ప్రాణనష్టమూ సంభవిస్తోంది. నాలుగేళ్ల క్రితం మణుగూరులో ఓ బంకరు కూలి కార్మికులు మృత్యువాత పడ్డారు. ఇటీవల సత్తుపల్లి ఏరియా కోల్ హ్యాండ్లింగ్ ప్లాంటు(సీహెచ్‌పీ)లో మూడింట ఓ బంకరుకు పగుళ్లు ఏర్పడ్డాయి. గత నెల 3 నుంచి ఆ బంకరులో లోడింగును నిలిపివేశారు. ప్లాంటులోని మూడు బంకర్లలో బొగ్గు నిల్వ చేస్తారు. ఇక్కడ్నుంచి సరిగ్గా ఇలాంటి మరో మూడు నిర్మాణాల్లోకి (జైలో) ఉత్పత్తి చేరుతుంది. తిరిగి అక్కడ్నుంచి రైలు వ్యాగన్లలోకి లోడవుతుంది. ఇటీవల రెండో బంకరులో పగుళు ఏర్పడ్డాయి. మరమ్మతులకు మరింత సమయం పట్టేలా ఉంది. దీన్ని నిర్మించిన సంస్థ ఇప్పటికే బిల్లులు పూర్తిచేసుకుంది. లోపాల్లో నాణ్యతకు ఎవర్ని బాధ్యుల్ని చేయాలని అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. నిర్మాణ సంస్థపైనే కోర్టుకు వెళ్లి నష్టపరిహారం రాబట్టుకునే అంశాన్ని పరిశీలిస్తున్నారు. ఎంతో కీలకమైన నిర్మాణంలో మూడేళ్లకే లోపాలు బయటపడటం పర్యవేక్షణ లోపాల్ని తేటతెల్లం చేస్తోంది. దీనివల్ల సంస్థకు రూ.50 లక్షల నుంచి రూ.కోటి వరకు నష్టం వాటిల్లుతుందని అంచనా. 'నిర్మాణ సంస్థ, బాధ్యులైన సింగరేణి అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలి. నిర్మాణ సంస్థను బ్లాక్‌లిస్టులో చేర్చాలి' అని ఐఎన్‌టీయూసీ నేతలు త్యాగరాజన్, రజాక్ డిమాండ్ చేశారు.



**అడుగడుగునా అవాంతరాలే..**
సీహెచ్‌పీలో తరచూ అవాంతరాలు తలెత్తుతుండటం అధికారులకు తలనొప్పిగా మారింది. బొగ్గును తరలించే బెల్టులు తెగిపోతుండటం, వాటి కింద ఉండే రోలర్లు మొరాయించడం పరిపాటి అయ్యింది. ప్రస్తుతం బంకరును చేరుకొనే లిఫ్టు సరిగా పనిచేయక కార్మికులు అవస్థలు పడుతున్నారు. బంకరులోని లోపాలు, పరిష్కార మార్గాలపై అధ్యయనం చేసే బాధ్యతను ధన్‌బాద్‌లోని 'సెంట్రల్ మైన్ ప్లానింగ్, డిజైన్ ఇన్‌స్టిట్యూట్', హైదరాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సంస్థలకు అప్పగించారు. ఆ సంస్థల సిఫార్సులతో మరమ్మతులకు వీలుగా సన్నద్ధత జరుగుతోంది.

సీహెచ్‌పీ వివరాలు..
నిర్మాణ వ్యయం: రూ.400 కోట్లు
ఎప్పుడు: మూడేళ్ల క్రితం
నిర్మించిన బంకర్లు: 3
ఒక్కోదాని నిల్వ సామర్థ్యం: 8,000 టన్నులు

మరో నెల రోజుల్లో వినియోగంలోకి..
షాలేమురాజు, ఏరియా జీఎం, కొత్తగూడెం అధ్యయన సంస్థల నిపుణులు గత నెల 11, 30 తేదీల్లో సీహెచ్‌పీని పరిశీలించారు. వారు పూర్తిస్థాయి నివేదికను అందించాల్సి ఉంది. సమస్య పరిష్కారంపై ఉన్నతస్థాయి అధికారులు తగిన నిర్ణయం తీసుకుంటారు. మరో నెలరోజుల్లో బంకరును తిరిగి వినియోగంలోకి తీసుకొస్తాం.

# శ్రావణం.. శుభప్రదం

ఖమ్మం : హిందూ సంప్రదాయంలో శ్రావణ మాసానికి ప్రత్యేక స్థానం ఉంది. వివాహాది శుభకార్యాలకు అనువైన మాసం. ఈ ఏడాది ఆగస్టు 5 నుంచి సెప్టెంబర్ 3 వరకు శ్రావణ మాసం కొనసాగనుంది. నెల రోజులపాటు శ్రీలక్ష్మీ అమ్మవారికి పూజలు చేయడంతోపాటు మహిళలు వ్రతాలు ఆచరిస్తారు. వివాహాలు, గృహ ప్రవేశాలు, నిశ్చితార్థాలు, శంకుస్థాపనలు, వ్యాపార ప్రారంభోత్సవాలు, అన్నప్రాశన, అక్షరాభ్యాసం, విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవాలు నిర్వహిస్తారు.

**వరలక్ష్మీ వ్రతాలు.. బోనాల సందడి**
శ్రావణ మాసం అంటే గుర్తుకొచ్చేవి శ్రీవరలక్ష్మీ అమ్మవారి వ్రతాలు. రెండో శుక్రవారం (ఆగస్టు 16న) మహిళలు వరలక్ష్మీ వ్రతం



చేసుకుంటారు. కుదరని వారు నాలుగో శుక్రవారం (ఆగస్టు 30న) ఆచరిస్తారు. ప్రతి మంగళ, శుక్రవారాల్లో శ్రీలక్ష్మీదేవికి దేవాలయాల్లో విశేష పూజలు, వ్రతాలు, సామూహిక కుంకుమ పూజలుంటాయి. జిల్లాలో ప్రతి గురు, ఆదివారాల్లో బోనాల వేడుకలు ఘనంగా నిర్వహిస్తారు. ఆషాఢ మాసానికి ముందు మూడు నెలలు, శ్రావణ మాసం తరువాత ముహూర్తాలు లేకపోవడంతో శుభకార్యాలకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఖమ్మం విపణిలో సందడి నెలకొంది. శ్రీమహావిష్ణువుకు ప్రీతికరమైన మాసం శ్రావణం. శ్రావణ మాసం ప్రారంభ రోజు నుంచే అన్ని శుభకార్యాలకు అనుకూలంగా ఉంది. కొత్తగా ఉపనయనాలు వేసుకున్న వారు రాఖీ పౌర్ణమి రోజున ఉపాకర్మ(మూంజి విడుపు) చేసుకోవాలి. మహిళలు వ్రతాలను ఆచరించుకోవచ్చు.ఆమంచి సురేశ్‌శర్మ, పురోహితులు, ఖమ్మం

# చెరువుల శిఖం..కబ్జాకోరుల వశం!

కొత్తగూడెం: ఎన్నో ఏళ్లుగా పంటల సాగులో అన్నదాతలకు అండగా నిలుస్తున్న చెరువులు, కుంటలు కుచించుకుపోతున్నాయి. కబ్జాలకు కాదేదీ అనర్హం అన్న రీతిలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో సాగు, తాగునీటి చెరువులు ఆక్రమణలకు గురవుతున్నాయి. కొందరు ఆక్రమణదారులు చెరువు శిఖం భూముల్లో సాగు చేస్తుండగా.. మరికొందరు అనధికార నిర్మాణాలతో 'రియల్' పంట పండిస్తున్నారు. **శాఖల మధ్య సమన్వయ లోపం** భద్రాద్రి జిల్లాలో 100 ఎకరాల కంటే ఎక్కువ ఆయకట్టు కలిగిన చెరువులు 168, అంతకంటే తక్కువ ఆయకట్టు విస్తీర్ణం గల చెరువులు 2,196 ఉన్నాయి. వీటిని రెవెన్యూ, జలవనరులశాఖ అధికారులు పరిరక్షించాలి. అయితే ఈ శాఖల మధ్య సమన్వయలోపం అక్రమార్కులకు వరంగా మారుతోంది. రెండు శాఖల అధికారులు సంయుక్తంగా సర్వే చేసి ఆక్రమణలను అరికట్టాలని అన్నదాతలు కోరుతున్నారు.

**భూముల ధరలకు రెక్కలు..** పెరుగుతున్న జనాభా, పట్టణీకరణ కారణంగా భూముల ధరలకు రెక్కలొస్తున్నాయి. ఖాళీ స్థలం కనిపిస్తే చాలు కబ్జా చేయాలని కొందరు అక్రమార్కులు యత్నిస్తున్నారు. ఖమ్మం అర్బన్, అశ్వారావుపేట, ఇల్లెందు, సత్తుపల్లి, కొణిజర్ల, చుంచుపల్లి, చర్ల, పాల్వంచ తదితర మండలాల్లో చెరువుల శిఖాలు క్రమేణా కబ్జాలకు గురవుతున్నాయి. చెరువులు, కుంటలు అన్యాక్రాంతం కాకుండా సర్వే చేసి వాటి వాస్తవ హద్దులను గుర్తించాలి. రెవెన్యూ, జలవనరులశాఖ అధికారులు సమన్వయంతో ఈ చర్యకు ఉపక్రమించాలి. చెరువులు, కుంటల పునరుద్ధరణతో పాటు సరిహద్దుల్లో మొక్కలు నాటాలి.

# పల్లెల్లో కొరవడిన పాలన



సిరిసిల్ల : జిల్లాలో పంచాయతీలు, మండల ప్రజా పరిషత్తులకు పాలకవర్గాల గడువు ముగియడంతో పల్లెల్లో పాలన కొరవడింది. పట్టించుకునే వారు లేక గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు నిలిచిపోయాయి. ప్రజలు అంటువ్యాధులతో అల్లాడుతున్నారు. నిత్యం పర్యవేక్షణ చేయాల్సిన ప్రత్యేక అధికారులు నిర్లక్ష్యం వహించడంతో క్షేత్ర స్థాయిలో పనులు ముందుకు సాగడం లేదు. ఓ వైపు నిత్యం కురుస్తున్న వర్షాలు, మరో వైపు రహదారులు, కాలువల్లో నిలిచిన మురుగుతో ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు.

**క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ కరవు** గ్రామాలు, మండలాల్లో సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీల పాలన ముగిసి ఏడు నెలలు పూర్తికావస్తున్నా ప్రజలకు అందాల్సిన కనీస సేవలు, వసతులు సక్రమంగా అందడం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ప్రత్యేక అధికారులు పల్లెల్లో పర్యటించకపోవడంతో గ్రామాల్లో నెలకొన్న సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. ఒక్కో పంచాయతీకి ఒక్కో అధికారిని నియమించాల్సి ఉండగా అధికారుల కొరత కారణంగా రెండు నుంచి మూడు గ్రామాలకు ఒక ప్రత్యేక అధికారిని నియమించడంతో పనిభారం పెరిగి క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ లోపించింది. ఇదే క్రమంలో జిల్లా స్థాయి అధికారులను మండల ప్రత్యేక అధికారులుగా నియమించడంతో వారి పర్యటనలు నామమాత్రంగా ఉంటున్నాయి. గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరిస్తామనుకున్న గ్రామస్థాయి అధికారులకు పంచాయతీల్లో నిధుల కొరతతో పనులు చేసేందుకు జంకుతున్నారు. రహదారులు, మురుగు కాలువల శుభ్రం, తాగునీటి సరఫరా, వీధి దీపాలు నిర్వహణ సక్రమంగా చేయడం లేదు. కాలువల్లో గడ్డి, చెత్త, మురుగు పేరుకుపోవడం, రోడ్లపై నీరు నిలవడంతో దోమలు పెరిగి ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా ప్రత్యేక అధికారులు గ్రామాల్లో పర్యటించి సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

**గ్రామాల్లో పారిశుద్ధ్యానికి చర్యలు**
జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు నిత్యం చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. మురుగు కాల్వలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, తాగునీరు కలుషితం కాకుండా చూడాలని, పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం వహించవద్దని కార్యదర్శులను.. ప్రత్యేక అధికారులు నిత్యం గ్రామాలను పర్యవేక్షించాలని ఆదేశాలు జారీ చేశాం.
వీరబుచ్చయ్య, జిల్లా పంచాయతీ అధికారి

# అడవులు అడగవనేగా..?



వికారాబాద్ : వికారాబాద్ జిల్లా అంటేనే పచ్చటి అటవీ ప్రాంతానికి పెట్టింది పేరు. వీటిని రక్షించడంలో క్షేత్ర స్థాయిలో నిఘా కొరవడింది. ఫలితంగా అక్రమార్కులు చెలరేగి పోతున్నారు. వివాదాలే ఆసరాగా అటవీ భూములను ఆక్రమించేస్తున్నారు. అధికారులు చోద్యం చూస్తున్నారు. దీనికి సంబంధించి కథనం.

**పోడు పేరుతో నమ్మించే యత్నం**
గత ప్రభుత్వం పోడు వ్యవసాయం కింద పట్టాలివ్వడానికి సిద్ధమైంది. ఇందుకు పోడు భూముల సర్వే చేశారు. దీన్ని అవకాశంగా మలుచుకుని శివారు భూములను చదునుచేసి పోడు భూములుగా పట్టాలివ్వాలని పలువురు నమ్మించే యత్నం చేశారు. జిల్లాలోని ధారూర్, బంట్వారం, యాలాల్, పెద్దేముల్, వికారాబాద్, పరిగి మండలాల పరిధిలోని దాదాపు వేల ఎకరాల భూములు ఇలా ఆక్రమణకు గురయ్యాయి. అటవీ భూముల ఆక్రమణకు రెవెన్యూ, అటవీశాఖాధికారుల సమన్వయ లోపమే వివాదాలకు కారణంగా కనిపిస్తోంది.

**కొన్ని ఉదాహరణలు..**
వికారాబాద్ పురపాలక సంఘం పరిధిలోని గిరిగిట్‌పల్లి శివారులో ప్రధాన రహదారికి ఆనుకొని 300 ఎకరాల భూమి 70 ఏళ్ల నుంచి అల్లాబక్ష్ పేరిట పట్టా బీడుగా ఉంది దీన్ని గమనించిన స్థిరాస్తి వ్యాపారులు రాజధానిలోని పట్టాదారు వారసులకు కొంత ముట్టజెప్పి ఒప్పందం చేసుకున్నారు. అయితే అప్పటికే అటవీశాఖ 100 ఎకరాల్లో దట్టంగా చెట్లు పెంచడంతో ఆ భూమి తమదేనని అటవీశాఖ హద్దులు వేసి కందకం తవ్వించింది. ఈ విషయమై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా, రెవెన్యూ, అటవీ అధికారులు సంయుక్తంగా సర్వే చేయాలని రెండేళ్ల కిందట ఆదేశించినా నేటికీ అపరిష్కృతంగానే ఉంది.

వికారాబాద్ మండలం పుల్‌మద్ది, మదన్‌పల్లి గ్రామాల్లో 80 మంది రైతులకు రెవెన్యూ అధికారులు 380 ఎకరాల భూములకు పట్టాలిచ్చారు. అవి అటవీశాఖకు చెందినవని, రెవెన్యూ అధికారులు ఇచ్చిన పట్టాలు చెల్లుబాటు కావని, సాగు చేసుకుంటున్న రైతుల భూములను ఆక్రమించుకొని కేసులు కూడా నమోదు చేశారు. మూడు దశాబ్దాలుగా ఈ సమస్య అపరిష్కృతంగానే ఉంది.

**క్షేత్ర స్థాయిలో పరిశీలించి విచారిస్తాం** ఒక్క ధారూర్ మండలం దోర్నాల్ శివారులో 60 ఎకరాల భూములను అక్రమార్కులు ఆక్రమించగా, అటవీశాఖ అధికారులు గుర్తించి తిరిగి స్వాధీనం చేసుకున్నారు. జిల్లాలో అటవీ భూముల ఆక్రమణపై క్షేత్రస్థాయిలో పరిశీలించి విచారణ చేస్తాం. ఇప్పటికే కొన్ని భూములు సర్వే చేసి హద్దు రాళ్లను పాతించాం. సమన్వయ లోపంతో కొన్ని ప్రాంతాల్లో అటవీ భూములకు రెవెన్యూ అధికారులు పట్టాలివ్వడంతో వివాదాలు చోటు చేసుకుంటున్నాయి.
– జ్ఞానేశ్వర్, జిల్లా అటవీశాఖాధికారి

# గుండు సూది నుంచి అంతరిక్షం దాకా..



వికారాబాద్ :ప్రపంచ ఖ్యాతి పొందిన పరిశ్రమలకు నిలయాలు. భిన్న రకాల ఉత్పత్తులు, వైవిధ్యమైన పరిశ్రమలు, పరిశోధన సంస్థలకు ఆలవాలం. దేశ ఆర్థిక వ్యవస్థకు, ప్రజల ఉపాధి కల్పనకు వెన్నుదన్నుగా ఉన్నాయి. గుండు సూది మొదలు అంతరిక్ష ప్రయోగ పరికరాల వరకు విడిభాగాల తయారీకి నగరం వేదికగా మారింది. ఇటీవల ప్రభుత్వం పారిశ్రామికాభివృద్ధికి పెద్దపీట వేస్తుండటంతో.. రాజధానిలోని ఉప్పల్, కాప్రా పరిధిలో విస్తరించిన పారిశ్రామికవాడల తీరుతెన్నులపై కథనం.

ప్రభుత్వం ఫార్మా, సాంకేతిక, విజ్ఞాన శాస్త్ర పరికరాల తయారీకి కేంద్రంగా ఇన్, అవుటర్ కారిడార్లను సిద్ధం చేయాలని నిర్ణయించింది. వీటికి అనుసంధానంగా ఐటీ పరిశ్రమలను వృద్ధి చేయడానికి ప్రభుత్వం బృహత్ ప్రణాళికను తయారు చేస్తోంది.

గుండుసూది మొదలు రక్షణ, వైమానిక, అంతరిక్షం, రైలింజిన్ల వరకూ విడిభాగాలు ఇక్కడే తయారవుతున్నాయి.
ఎంతోమందిని ఈ పారిశ్రామికవాడలు అక్కున చేర్చుకుంటున్నాయి. ఇక్కడ ఏటా రూ.50 వేల కోట్ల ఉత్పత్తులు జరుగుతాయి.
పారిశ్రామిక ప్రగతి కొత్త పుంతలు తొక్కుతోంది. భవిష్యత్తంతా 'ఆర్టిఫిషియల్ ఇంటలీజెన్సీ (ఏఐ)' వైపే ఉంది. ఐటీ, సీఎన్‌సీ, అడ్వాన్స్‌డ్ మ్యాన్‌ఫ్యాక్చరింగ్ మిషనరీ, స్కిల్ డెవలప్‌మెంట్ పరిశ్రమల్లో ఈ ప్రాంతం ప్రపంచంతో పోటీ పడొచ్చు. యువతకు ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయి.
– జక్కా రోషిరెడ్డి, ఛైర్మన్, చర్లపల్లి

ఐలా ఆహార ఉత్పత్తి, శుద్ధి, ఫుడ్ ప్రాసెసింగ్, ఫార్మా, ప్యాకేజింగ్ వంటి పరిశ్రమలు రావాలి. దీంతో యువతకు, మహిళలకు ఉపాధి లభిస్తుంది. దేశ సంపద సృష్టికి మెకానికల్, రక్షణ, వైమానిక రంగం ఉత్పత్తుల పరిశ్రమలు వస్తే 2 లక్షల మందికి అవకాశాలు వస్తాయి.
– కాటిరెడ్డి గోవింద్‌రెడ్డి, అధ్యక్షుడు, సీఐఏ, ఐడీఏ చర్లపల్లి

చర్లపల్లి పారిశ్రామికవాడ అయిదు దశల్లో విస్తరించింది. 1982లో ఏర్పాటైన ఇది గతంలో 'కాప్రా ఇండస్ట్రీయల్ మున్సిపాలిటీ'గా ఉండేది. 1999లో ప్రత్యేక 'ఐలా'గా రూపుదిద్దుకుంది.

ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, ఫార్మా, ప్యాకింగ్, అణు ఇంధనానికి సంబంధించిన పరికరాలు, వాహనాలు రైల్వేశాఖల్లో ఉపయోగించే విడిభాగాలు ఉత్పత్తి చేస్తున్నారు. నాణేల ముద్రణాలయం, ఈవీఎంలు, వంట గ్యాస్, పెట్రోలియం, డీజిల్ కంపెనీలు, ప్రపంచ స్థాయి విమతా లాబ్స్, న్యూక్రియానిక్స్ వంటి పరిశ్రమలు ఉన్నాయి.జీవీకే, నాగార్జున ఫెర్టిలైజర్స్, వ్యాధి నిరోధక ఔషధాలయం, ఆహార పదార్థాల పరీక్షాలయం, రక్షణ శాఖకు చెందిన భెల్, ఏపీ ఫుడ్స్, ఐటీ పార్కు వంటి అనేక పరిశ్రమలు నాచారంలో ఉన్నాయి. ప్రపంచీ కరణ, ఆర్థికమాంద్యంతో 15 శాతానికి పైగా పరిశ్రమలు మూతపడ్డాయి.

# ఎప్పటికీ హై టెన్షన్

ఖమ్మం :నివాసాలు, భవనాలకు అత్యంత చేరువగా విద్యుత్తు తీగలు వెళ్తుండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. విద్యుత్తు రవాణా కోసం గతంలో శివారు ప్రాంతాల్లో హైటెన్షన్ లైన్లు ఏర్పాటుచేశారు. కాలక్రమేణా ఈ లైన్ల పరిసరాల్లో పట్టణాలు, నగరాలు, గ్రామాలు విస్తరించాయి. కొందరు అనుమతి లేకుండా విద్యుత్తు లైన్ల కింద, చేరువగా భవన నిర్మాణాలు చేపట్టారు. ఈ నేపథ్యంలో సంభవిస్తున్న ప్రమాదాల్లో అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఖమ్మం జిల్లాలో నివాసాల మీదుగా ఉన్న సుమారు 100 కి.మీ. హైటెన్షన్, ఎల్‌టీ విద్యుత్తు లైన్లను తొలగించి 110 కి.మీ. పొడవున కొత్తగా లైను నిర్మించాల్సి ఉంటుందని 2020లో అధికారులు అంచనాలు రూపొందించారు. సుమారు రూ.4.5 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినా కార్యరూపం దాల్చలేదు.
ఖమ్మం జిల్లా కేంద్రంలోని వేణుగోపాల్‌నగర్‌లో హైటెన్షన్ తీగలపై



పడిన తాళం చేతులను ఇనుప రాడ్డుతో తీస్తుండగా విద్యుదాఘాతం సంభవించి ఓ మహిళ ఈ నెల 2న మృతిచెందారు. ఎక్కడెక్కడంటే..
ఖమ్మం జిల్లా కేంద్రంలోని రాపర్తినగర్, దానవాయి గూడెం, వేణుగోపాల్‌నగర్, బాలాజీనగర్, యూపీహెచ్ కాలనీ, ప్రశాంతినగర్, ఖానాపురం, పాండురంగాపురం, రఘునాథపాలెం మండలం బూడిదంపాడు తదితర ప్రాంతాల్లో ఇళ్ల చెంత, గృహాల మీదుగా విద్యుత్తు లైన్లు ఉన్నాయి. అశ్వారావుపేట మండలం మోడల్ కాలనీలో హైటెన్షన్ విద్యుత్తు తీగలు ప్రమాదకరంగా మారాయి. విద్యుత్తు లైన్లకు అత్యంత చేరువగా ఇళ్లు నిర్మించి ప్రమాదాలు కొనితెచ్చుకోవద్దు. ఖమ్మం డివిజన్‌లో అనేక ప్రాంతాల్లో హైటెన్షన్, ఎల్టీ విద్యుత్తు లైన్ల కింద, పరిసరాల్లో నివాసాలున్నాయి. లైన్ల మార్పిడికి అంచనాలు రూపొందించి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైతే పనులు చేపడతాం.రామారావు, డీఈ, ఖమ్మం

# మహిళా శక్తి.. ఉపాధిపై ఆసక్తి

ఆలేరు : మహిళా శక్తి పథకంలో యూనిట్ల స్థాపనకు అతివలు ముందుకు వస్తున్నారు. యూనిట్లను మంజూరు చేసి తద్వారా లబ్ధిదారులకు ఉపాధి, కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. పాడిగేదెలు, ఆవులు, పెరటి కోళ్ల పెంపకం, మదర్ పౌల్ట్రీ యూనిట్ల స్థాపనకు మండల స్థాయిలో శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. పశుసంవర్ధక శాఖ సహకారంతో మండల స్థాయిలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా పాలనాధికారి శనివారం ఆదేశాలు జారీచేశారు.
లక్ష్యానికి మించి.. జిల్లాలో పాడి పశువుల యూనిట్ల లక్ష్యం 3,500 కాగా 3,537 మంది, పెరటి కోళ్ల యూనిట్ల లక్ష్యం 1,600 కాగా 1,975, పౌల్ట్రీ మదర్ యూనిట్ల లక్ష్యం 17 కాగా 26 మంది ముందుకు వచ్చారు. లబ్ధిదారుల వివరాలను సెర్ప్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశారు. పాడి పశువుల యూనిట్లకు సంబంధించి ఇతర రాష్ట్రాల



నుంచి గేదెలు, ఆవులను కొనుగోలు చేయాల్సి ఉంటుంది.
5 నుంచి శిక్షణ కార్యక్రమాలు
లబ్ధిదారులకు ఈ నెల 5వ తేదీ నుంచి శిక్షణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. కార్యక్రమాలన్నీ వారం రోజుల్లోగా పూర్తి చేయాల్సి ఉంటుంది. వివిధ రాష్ట్రాలలో పాడిపశువుల పోషణ, అక్కడి వాతావరణ పరిస్థితులు, ఇక్కడికి తీసుకువచ్చాక పోషణ విధానం, కృత్రిమ గర్భధారణ, సైలేజీ, పచ్చిగడ్డి, దాణా, రుణ వితరణ, బీమా తదితర అంశాలపై శిక్షణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మండల పశుసంవర్ధక శాఖ అధికారి సమన్వయంతో గుర్తించిన లబ్ధిదారులకు ఒక్కోరోజు ఒక్కో బ్యాచ్‌కు (40–50 మంది) శిక్షణ ఇస్తారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు, ఐకేపీ ఏపీఎం పర్యవేక్షణలో జరగనున్న ఈ కార్యక్రమాలకు పశుసంవర్ధకశాఖ అధికారులు, బ్యాంకు మేనేజర్, స్త్రీనిధి మేనేజర్, పశుమిత్రలు విధిగా హాజరు కావాల్సి ఉంటుంది.

# సన్నాలకే సై..!

ఆలేరు : ఉమ్మడి నల్గొండ జిల్లా రైతులు వరిలో సన్నరకాల సాగుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. మార్కెట్లో సన్న రకం బియ్యానికి మంచి ధర పలుకుతుండటం, ప్రభుత్వం రూ.500 బోనస్‌ను ప్రకటించడం కూడా ఇందుకు ఊతమిస్తోంది. ఈసారి వర్షాలు అనుకూలించకపోయినప్పటికీ చాలా మంది రైతులు సన్నరకాల నారును పోశారు. నీటి వసతులు ఉన్నచోట నాట్లు సైతం వేశారు. ఇప్పటి వరకు వర్షాలు ఆశాజనకంగా లేకపోగా కుంటలు, చెరువులు వెలవెలబోతున్నాయి. వ్యవసాయ బోర్లు ఎత్తిపోతున్నాయి. వరినాట్లకు ఈ నెలాఖరు వరకు సమయం ఉండటం, వర్షాలు సమృద్ధిగా కురుస్తాయనే ఆశతో అన్నదాతలు ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో ఏటా వానాకాలం సీజన్లో సుమారు 13.5 లక్షలకు పైగా ఎకరాల్లో వరి సాగవుతుంది. ఈసారి మాత్రం ప్రతికూల వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో 12.4 లక్షల ఎకరాల్లో సాగవుతుందని వ్యవసాయశాఖ అంచనా వేసింది. సన్నరకాలకు బోనస్ ప్రకటించడంతో ఎక్కువగా సన్నరకాల సాగును చేపడుతున్నారు. ఇప్పటికే నాట్లు పూర్తయిన వాటిలో 30 శాతానికి పైగా సన్న రకాలు ఉన్నాయని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.
దొడ్డు రకాల సాగుకు సన్నరకాల సాగుకు అయ్యే పెట్టుబడులతో పోల్చితే... తక్కువ ఖర్చవుతుంది. దొడ్డు రకాలకు ఎకరాకు రూ.22వేల వరకు పెట్టుబడి అవుతుండగా 25–28 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.



# నీరు - చెట్టు పెండింగ్ నిధుల విడుదలకు సీఎం చంద్రబాబు ఆదేశం

అమరావతి: నీరు– చెట్టు పెండింగ్ నిధులు విడుదల చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. నీరు– చెట్టు పెండింగ్ బిల్లులపై మంత్రులు పయ్యావుల కేశవ్, నిమ్మల రామానాయుడు, అనగాని సత్యప్రసాద్ సీఎంను కలిశారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న నీరు–చెట్టు బిల్లుల విడుదలపై ఈ సందర్భంగా సీఎం కీలక నిర్ణయం తీసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులకు దశల వారీగా నిధులు విడుదల చేయాలని ఆర్థికశాఖను సీఎం ఆదేశించారు. తొలి విడతలో రూ.259 కోట్లు విడుదల చేయాలని సూచించారు.

# మద్యం విధానంపై నివేదికలు తెప్పించుకున్నాం: మంత్రివర్గ ఉపసంఘం




అమరావతి: మద్యం విధానంపై క్షేత్రస్థాయిలో వివిధ సంఘాల నుంచి నివేదికలు తెప్పించుకున్నామని, క్యాబినెట్‌లో తమ నివేదికలను సమర్పిస్తామని మంత్రులు తెలిపారు. ఏపీలో నూతన మద్యం విధానంపై సీఎం చంద్రబాబుతో మంత్రివర్గ ఉపసంఘం సమావేశమై చర్చించింది. అనంతరం మంత్రులు నాదెండ్ల మనోహర్, సత్యకుమార్, కొల్లు రవీంద్ర, కొండపల్లి శ్రీనివాస్ మీడియాతో మాట్లాడారు. "గత పాలకులు జే బ్రాండ్ మద్యం తీసుకువచ్చారు. మద్యపానం నిషేధమని మాయమాటలు చెప్పి సొంత బ్రాండ్లు ప్రవేశపెట్టారు. మల్టీ నేషనల్ బ్రాండ్లు రాష్ట్రంలోకి రాకుండా అడ్డుకున్నారు. ప్రభుత్వ ఆదాయం పాలకుల జేబుల్లోకి వెళ్లింది. అర్హత లేని వ్యక్తిని డిప్యుటేషన్‌పై తీసుకొచ్చి వ్యవస్థను భ్రష్టుపట్టించారు. నాసిరకం బ్రాండ్లు తెచ్చి ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడారు. గత ప్రభుత్వ తప్పుడు విధానాలతో రాష్ట్రం ఆర్థికంగా నష్టపోయింది. గతంలో ఎక్సైజ్ పాలసీని జేబులు నింపుకోవడానికే వాడుకున్నారు. భవిష్యత్తులో వచ్చే ఆదాయంపై కూడా అప్పులు తెచ్చారు. నాణ్యత లేని మద్యం సరఫరా చేసి ప్రజల జీవితాలతో చెలగాటమాడారు. ఆడబిడ్డల పుస్తెలతాళ్లు తెగడంతో వేల కుటుంబాలు రోడ్డున పడ్డాయి. ప్రజారోగ్యం దృష్ట్యా కొత్త ఎక్సైజ్‌విధానం రావాలి"అని అన్నారు.




## కొంపలేం మునిగిపోవు.. 'బుల్డోజర్ న్యాయం' ఆపండి: సుప్రీం కోర్టు

ఇప్పటికిప్పుడు 'బుల్డోజర్ న్యాయం' చేయడంపై సుప్రీం కోర్టు అసహనం వ్యక్తం చేసింది. దేశవ్యాప్తంగా ఇటీవల కాలంలో వివిధ రాష్ట్రాలు విచారణలో ఉన్న నేరగాళ్ల ఇళ్లు, ప్రైవేటు ఆస్తులపైకి బుల్డోజర్లను నడిపించే విషయంలో బాధితులకు ఉపశమనం ఇవ్వడం, దేశస్థాయిలో మార్గదర్శకాల తయారీపై నేడు న్యాయస్థానం విచారణ చేపట్టింది. జస్టిస్ బి.ఆర్.గవాయ్ నేతృత్వంలోని బెంచ్ వాదనలు వినింది. అనధికారికంగా జరిపే ఇటువంటి బుల్డోజర్ చర్యలను అక్టోబర్ 1వ తేదీ వరకు నిలిపివేయాలని పేర్కొంది. మరోవైపు వీటిని ఆపితే ఆక్రమణల తొలగింపు ఆలస్యమవుతుందన్న ప్రభుత్వ భయాలను కొట్టిపారేసింది. "వచ్చే విచారణ తేదీ వరకు మీ చర్యలను ఆపమని మేం కోరినంత మాత్రాన కొంపలేం మునిగిపోవు" అని జస్టిస్ బి.ఆర్.గవాయ్, కె.వి.విశ్వనాథన్ వ్యాఖ్యానించారు. ఈ నెలలో ఇప్పటికే రెండు సార్లు వివిధ రాష్ట్రాలు చేపట్టిన 'బుల్డోజర్ చర్యల'పై న్యాయస్థానం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ ప్రాక్టీస్‌ను హీరోయిజంగా చూపే యత్నం చేయవద్దని హెచ్చరించింది. తమ అనుమతులు లేకుండా ఎటువంటి కూల్చివేతలు చేపట్టొద్దని తేల్చిచెప్పింది. దీనిపై ఎన్నికల కమిషన్‌కు కూడా నోటీసులు జారీ చేస్తామని వెల్లడించింది. మహారాష్ట్ర, ఝార?ండ్, జమ్మూ కశ్మీర్, హరియాణల్లో అసెంబ్లీ ఎన్నికలు ఉండటంతో ఈసీకి నోటీసులు ఇస్తామని చెప్పడం ప్రాధాన్యం సంతరించుకొంది. ఈ రాష్ట్రాల్లో చాలా చోట్ల భాజపా అధికారంలో ఉంది. అదే సమయంలో బహిరంగ స్థలాలు, రైల్వే ఆస్తులు, నీటి వనరుల ఆక్రమణల తొలగింపు విషయంలో మాత్రం తమ ఆదేశాలు వర్తించవని తేల్చిచెప్పింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది దుష్యంత్ దవే, సీయూ సింగ్ వాదనలు వినిపించారు. ఇప్పటికే సెప్టెంబర్ 2వ తేదీన జరిగిన వాదనల్లో దేశంలో ఎక్కడా ఈ తరహా చర్యల్లో మార్గదర్శకాలను పాటించడంలేదని పేర్కొన్నారు. ఈ కేసులో ప్రధాన పిటిషనర్‌గా జామత్ ఉలేమా హింద్ వ్యవహరిస్తోంది. కూల్చివేతలకు ముందు కనీసం 40-60 రోజుల ముందుగా నోటీసులు జారీ చేయాలని, చట్ట వ్యతిరేక కూల్చివేతలకు సదరు అధికారులను బాధ్యులను చేయాలని ఆ సంస్థ సుప్రీంకు నివేదించింది. యూపీ ప్రభుత్వం పక్షాన సోలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు.


# విద్యుత్ స్టోరేజీకి కేరాఫ్ అడ్రస్‌గా ఆంధ్రప్రదేశ్: మంత్రి గొట్టిపాటి



గాంధీనగర్: విద్యుత్ స్టోరేజీకి ఆంధ్రప్రదేశ్‌ను కేరాఫ్ అడ్రస్‌గా నిలిపే లక్ష్యంతో పనిచేస్తున్నట్టు ఏపీ విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికమార్ తెలిపారు. గుజరాత్‌లోని గాంధీనగర్‌లో జరిగిన 'రెన్యువబుల్ ఎనర్జీ ఇన్వెస్టర్స్ మీట్-2024'లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అపార అవకాశాలు, మానవ వనరుల గురించి వివరించారు. పునరుత్పాదక విద్యుత్ ఆధారంగా ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ కోతలు లేకుండా నిరంతరాయంగా విద్యుత్ అందించడమే లక్ష్యంగా తాము పనిచేస్తున్నట్టు వెల్లడించారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో తాము కీలక లక్ష్యాలను నిర్దేశించుకున్నట్టు తెలిపారు. లక్ష్యాలను అందుకునే దిశగా సౌర, పవన విద్యుత్ ప్రాజెక్టులను ఏపీలో ప్రోత్సహిస్తున్నట్టు వివరించారు. దీంతో పాటు విద్యుత్ స్టోరేజీ సాంకేతికత కూడా వినియోగిస్తామన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 3.0 సంస్కరణలను అమలు చేస్తున్నామని మంత్రి రవి కుమార్ తెలిపారు. ఇందులో భాగంగా విద్యుత్ స్టోరేజీ విధానంపై ప్రధానంగా దృష్టి పెట్టామని చెప్పారు. విద్యుత్ స్టోరేజీకి ఆంధ్రప్రదేశ్‌ను కేరాఫ్ అడ్రస్‌గా నిలిపే లక్ష్యంతో పని చేస్తున్నట్లు పేర్కొన్నారు. రూఫ్‌టాప్ సోలార్, డీ- సెంట్రలైజ్డ్ మైక్రో గ్రిడ్ల ఏర్పాటుతో విద్యుత్ ఉత్పత్తిని ప్రజలకు మరింత చేరువ చేసి, క్షేత్రస్థాయిలో ఇంధన భద్రత పెంచుతామని వివరించారు.

# బద్రీనాథ్ యాత్రకు వెళ్లిన తెలుగు వారు సురక్షితం

న్యూఢిల్లీ , సెప్టెంబర్ 17: బద్రీనాథ్ యాత్రకు వెళ్లిన తెలుగు యాత్రికులు సురక్షితంగా ఉన్నారు. యాత్రికులతో రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత మాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే తెలుగు యాత్రికులకు సంబంధించి ఢిల్లీ ఏపీభవన్ అధికారులతో హోంమంత్రి సమన్వయం చేశారు. తెలుగు యాత్రికులంతా క్షేమంగా రుద్ర ప్రయాగకు చేరుకున్నట్లు హోంమంత్రికి ఏపీ భవన్ అధికారులు సమాచారం ఇచ్చారు. రుద్ర ప్రయోగం నుంచి ఈరోజు వారి వారి స్వస్థలాలకు బయలుదేరుతున్నట్లు యాత్రికులు సమాచారం పంపారు.






భారీ వర్షాలతో మయన్మార్ అతలాకుతలమైంది. ఈ క్రమంలోనే యాగీ తుపాను విరుచుకుపడటంతో వరదలు పోటెత్తాయి. పెద్దఎత్తున కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ఘటనల్లో దాదాపు 226 మంది మృతి చెందారు.

మరో 77 మంది గల్లంతైనట్లు అధికారిక మీడియా వెల్లడించింది. లక్షలాది మంది ప్రజలు తమ ఇళ్లను వదిలి సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లారు. దాదాపు 6.30 లక్షలమంది ప్రకృతి విపత్తుతో ప్రభావితమయ్యారని.. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని ఐరాస తెలిపింది. మయన్మార్‌లో ఇటీవలి సంవత్సరాల్లో అత్యంత దారుణమైన వరదలు ఇవేనని పేర్కొంది. ఇప్పటికే అంతర్యుద్ధంతో సతమతమవుతున్న మయన్మార్‌లో వరదల ధాటికి.. వేల ఎకరాల్లో పంట నాశనమైంది. రాజధాని నేపిడావ్ ప్రాంతం తీవ్రంగా ప్రభావితమైంది. దాదాపు ఐదు లక్షల మంది ప్రజలు ఆహారం, తాగునీరు, సరైన ఆశ్రయం లేక అల్లాడుతున్నట్లు ఐరాస తెలిపింది. రహదారుల వంటి మౌలిక సౌకర్యాలు దెబ్బతినడంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోందని పేర్కొంది. ఈ క్రమంలోనే తమ దేశాన్ని ఆదుకోవాలని అక్కడి సైనిక పాలక వర్గం జుంటా విదేశీ సాయాన్ని అభ్యర్థించినట్లు తెలుస్తోంది. వియత్నాం, థాయ్‌లాండ్, లావోస్‌లలోనూ యాగీ తుపాను విధ్వంసం సృష్టించింది. ఒక్క వియత్నాంలోనే 300 మందిని బలితీసుకుంది.




దిల్లీ: దిల్లీ ముఖ్యమంత్రి పదవికి అరవింద్ కేజ్రీవాల్ రాజీనామా చేశారు. మంగళవారం సాయంత్రం లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనాను కలిసిన ఆయన.. తన రాజీనామా లేఖను అందజేశారు. ఆయనతో పాటు ఆప్ శాసనసభాపక్ష నేతగా ఎన్నికైన ఆతిశీ, ఇతర మంత్రులు సైతం ఉన్నారు. కేజ్రీవాల్ రాజీనామాను ఎల్జీ ఆమోదించాక.. త్వరలోనే ఆతిశీ కొత్త సీఎంగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఆతిశీ క్యాబినెట్‌లో డిప్యూటీ సీఎం పదవి ఉండదని, ఆమె సెప్టెంబర్ 26-27 తేదీల్లో జరిగే ప్రత్యేక అసెంబ్లీ సమావేశాల్లో ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసే అవకాశం ఉందని సమాచారం. ఆతిశీని తదుపరి సీఎంగా ఎంపిక చేయడంపై మంత్రి గోపాల్ రాయ్ మాట్లాడారు. "పరీక్ష కాలంలో ఆతిశీకి ఈ బాధ్యతలు అప్పగించాం. ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు ఏజెన్సీలను దుర్వినియోగం చేస్తున్నారు. అలాంటి ప్రయత్నాలను ఆప్ భగ్నం చేసింది" అన్నారు. దిల్లీ మద్యం విధానం కేసులో మనీలాండరింగ్ ఆరోపణలపై సీఎం కేజ్రీవాల్ అరెస్టయిన విషయం తెలిసిందే. ఇటీవల తిహాడ్ జైలు నుంచి విడుదలైన ఆయన సీఎం పదవికి రాజీనామా చేస్తానని ఆదివారం ప్రకటించారు. ఇందులో భాగంగా మంగళవారం తన రాజీనామాను ఎల్జీకి అందజేశారు.

దిల్లీ ప్రజలు తనకు నిజాయతీపరుడని సర్టిఫికెట్ ఇచ్చే వరకు ఆ పదవిని చేపట్టబోనని ఆయన ప్రతినబూనారు.

# వివేకా కుమార్తె సునీత ఫిర్యాదు.. సానుకూలంగా స్పందించిన సీఎం చంద్రబాబు



అమరావతి: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె సునీత దంపతులు ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. వివేకా పీఏ కృష్ణారెడ్డి ఫిర్యాదు మేరకు.. అప్పటి సీబీఐ ఎస్పీ రాంసింగ్‌తో పాటు తమపై అక్రమ కేసు పెట్టారని సీఎం దృష్టికి తెచ్చారు. కృష్ణారెడ్డి ఫిర్యాదులో నిజానిజాలపై విచారణ చేయించాలని కోరారు. రాంసింగ్‌పై కేసు వంటి అంశాలపై విచారణ చేయించాలని విజ్ఞప్తి చేశారు. సీఐడీ విచారణ ద్వారా వాస్తవాలు బయటకు తేవాలని కోరారు. సునీత విజ్ఞప్తిపై సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. తనకు అన్ని విషయాలు తెలుసని.. విచారణ చేయిస్తానని హామీ ఇచ్చారు.

# జత్వానీ కేసులో భయంతోనే.. నీలి మీడియా తప్పుడు రాతలు: పీతల సుజాత

అమరావతి: ఏపీ రాజకీయాల్లో బాలీవుడ్ నటి కాదంబరి జత్వానీ వ్యవహారం పెను సంచలనాలు సృష్టిస్తున్న విషయం తెలిసిందే. అయితే ఈ కేసులో వైసీపీ నేతలపై పలు ఆరోపణలు వచ్చాయి. అయితే ఈ కేసుపై మాజీ మంత్రి పీతల సుజాత స్పందించారు. వైసీపీ నేతలు, మాజీ సీఎం జగన్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు. విశాఖపట్నంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పీతల సుజాత ఈరోజు(మంగళవారం) మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుజాత మాట్లాడుతూ... బాలీవుడ్ నటి జత్వానీ కేసులో భయంతోనే.. నీలి మీడియా తప్పుడు రాతలు రాస్తోందని ఆరోపణలు చేశారు. నీలి మీడియాలో మహిళలను కించపరుస్తూ తప్పుగా రాయటాన్ని తీవ్రంగా ఖండించారు. జత్వాని కేసుకు దేశవ్యాప్త మద్దతు లభిస్తోందని అన్నారు. నీలి మీడియా మాత్రం దోషులను కాపాడేందుకు తప్పుడు రాతలు రాస్తోందని పీతల సుజాత ఆరోపించారు. కుట్రపూరితంగా మహిళలందరినీ ఇబ్బందులకు గురిచేయాలని వైసీపీ నేతలు చూస్తున్నారని మండిపడ్డారు. ఇది వారి దిగజారుడు రాజకీయానికి నిదర్శనమని అన్నారు. జగన్ మోహన్ రెడ్డి స్క్రిప్ట్‌తోనే జత్వానిపై కేసులు నమోదు చేస్తున్నామని అన్నారు.



జత్వానిని, ఆమె తల్లిదండ్రులను వైసీపీ నేతలు దారుణంగా హింసించారని ఆరోపించారు. మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ 151 నుంచి 11 సీట్లకు పడిపోయేసరికి జగన్ రెడ్డి మైండ్ బ్లాక్ అయిందని పీతల సుజాత ఆరోపణలు చేశారు. వైసీపీ ప్రభుత్వంలో లాగా కూటమి ప్రభుత్వంలో చేస్తామంటే కుదరదని స్పష్టం చేశారు. తప్పు చేసిన వారు ఎంతటి వారైనా చర్యలు తప్పకుండా తీసుకుంటామని పీతల సుజాత హెచ్చరించారు.

**విజయసాయికి టీడీపీ నేత సవాల్ :** వైసీపీ నాయకులు గత ఐదేళ్లలో చేసిన కబ్జాల వల్ల బుడమేరు వరద నీరు విజయవాడలోకి వచ్చి విధ్వంసం సృష్టించిందని తెలుగుదేశం పార్టీ ఆంధ్రప్రదేశ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నాదెండ్ల బ్రహ్మం అన్నారు. బుడమేరు ఆక్రమణలను ఇప్పటికైనా తొలగించకపోతే భవిష్యత్తులో విజయవాడ పట్టణానికి మరిన్ని విపత్తులు పొంచి ఉన్నాయని హెచ్చరించారు. వైసీపీ నేత విజయసాయి రెడ్డికి విజయవాడ ప్రజలు ముఖ్యం కాదా అని ప్రశ్నించారు. బుడమేరు పరివాహక ప్రాంతాల్లో వైసీపీ నాయకులు చేసిన ఆక్రమణలు ముఖ్యమో? తేల్చుకోవాలని సవాల్ విసిరారు. బుద్ధి, జ్ఞానం ఉన్న వారెవరు బుడమేరు ఆక్రమణల తొలగింపునకు చంద్రబాబు అద్దె ఇంటికి లంకె పెట్టరని నాదెండ్ల బ్రహ్మం అన్నారు. చంద్రబాబు అద్దెకు ఉన్న ఇల్లు ఆయన సొంతం కాదని ముందుగా పులివెందుల ఎమ్మెల్యే అతని బ్యాచ్ తెలుసుకోవాలని అన్నారు. బుడమేరు ఆక్రమణలు తొలగించవద్దని.. దమ్ముంటే సాయిరెడ్డి విజయవాడ నడిబొడ్డున నిలబడి చెప్పాలని నాదెండ్ల బ్రహ్మం సవాల్ విసిరారు.

# జగన్.. తిరుమల శ్రీవారితో పెట్టుకోవద్దు: మంత్రి నారా లోకేశ్

అమరావతి: తిరుమల శ్రీవారితో పెట్టుకోవద్దని వైకాపా అధ్యక్షుడు జగన్‌ను మంత్రి నారా లోకేశ్ హెచ్చరించారు. విజయవాడలో మంత్రి సంధ్యారాణి ఇంట్లో జరిగిన పుట్టినరోజు వేడుకలు తిరుమలలో జరిగినట్టు ఫేక్ ప్రచారం చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. "ఫేక్ జగన్.. నువ్వు మారవు.. నీ ఫేక్ మూకలు అస్సలు మారరు.

ఫేక్ చేసీచేసి 151 నుంచి 11 సీట్లకు వచ్చావు. మంత్రి సంధ్యారాణి ఇంట్లో జరిగిన బర్త్‌డే వేడుకలు తిరుమలలో జరిగినట్లు ఫేక్ ప్రచారం చేస్తున్నావు. శ్రీవారితో పెట్టుకోవద్దు.. ఏడు కొండలపై నీ విష రాజకీయాలు వాడొద్దు. ఇదే తీరు కొనసాగిస్తే ఒక్క సీటూ లేకుండా పోతావ్" అని లోకేశ్ హితవు పలికారు.



# శివాత్మిక రాజశేఖర్ ప్లెక్సిబుల్ వర్కవుట్

బాలీవుడ్ లో యువకథానాయికలు జాన్వీ కపూర్, సారా అలీఖాన్, అనన్య పాండే తదితరులు ఎల్లపుడూ ఫిట్ నెస్ కోసం తీసుకునే శ్రద్ధ ఇతర నటీమణులకు స్ఫూర్తి నింపుతుంది. టాలీవుడ్ లో సమంత, శోభిత, రకుల్ ఫిట్ నెస్ ఫ్రీకులుగా సుపరిచితులు. నేటితరంలో యాంగ్రీ హీరో రాజశేఖర్ కుమార్తెలు శివానీ, శివాత్మిక ఫిట్ నెస్ ఔత్సాహికులుగా అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. తాజాగా శివాత్మిక సోషల్ మీడియా ప్రొఫైల్ లో షేర్ చేసిన ఒక వీడియో ఆశ్చర్యపరుస్తోంది. శివాత్మిక నటనలో నిరూపించుకుంటూనే, ఫిట్‌నెస్ ఔత్సాహికురాలుగా చాలా హార్డ్ వర్క్ చేస్తోంది. తన టోన్డ్ లుక్ తో అందరి దృష్టిని ప్రత్యేకంగా ఆకర్షిస్తోంది. ఇటీవల తన తీవ్రమైన



జిమ్ సెషన్ లో శివాత్మిక లెగ్ వర్కౌట్ లు.. పుల్-అప్ లు.. బరువులను లాగేందుకు శ్రమ ఆశ్చర్యపరుస్తున్నాయి. ఒక తెలుగమ్మాయి ఇంతగా ఫిట్ నెస్ కోసం శ్రమించడం తన పట్టుదల సంకల్పాన్ని వెల్లడిస్తోంది. శివాత్మిక టోన్డ్ ఫిజిక్ వెనక తీవ్రమైన కృషి దాగి ఉంది. ఫిట్‌నెస్ పరంగా అంకితభావం, అభిరుచి సోషల్ మీడియా పోస్ట్‌లలో స్పష్టంగా కనిపిస్తున్నాయి. శివాత్మిక కెరీర్ మ్యాటర్ కి వస్తే.. ఆరంగేట్రం ఆనంద్ దేవరకొండ సరసన దొరసాని చిత్రంలో నటించింది. కృష్ణవంశీ రంగ మార్తాండ చిత్రంలో చివరిగా కనిపించిన శివాత్మిక తన ప్రతిభతోను ఆకట్టుకుంది. ఆ తర్వాత తన ప్రాజెక్టుల గురించిన వివరాలు వెల్లడి కాలేదు. శివాత్మికను చూడగానే జానకి రాముడు లో నాగార్జున సరసన నటించిన జీవితనే గుర్తుకు వస్తుంది. తనకు అలాంటి ఒక మంచి అవకాశం రావాలని ఆకాంక్షిద్దాం.

# మంచు గుహల్లో సీతమ్మ బెడ్ రూమ్ సీన్సా?

మృణాల్ ఠాకూర్ అలియాస్ సీతమ్మ కెరీర్ ఇప్పుడు జెట్ స్పీడ్ తో దూసుకుపోతున్న సంగతి తెలిసిందే. టాలీవుడ్, బాలీవుడ్ లో వరుసగా అవకాశాలు అందుకుంటుంది. ఇంకా చెప్పాలంటే టాలీవుడ్ ని మించి బాలీవుడ్ లో రెట్టించిన పారితోషికంతో అవకాశాలు ఒడిసి పట్టుకుంటుంది. ఇప్పటికే పూజా మేరీజాన్ షూటింగ్ పూర్తి చేసింది. అలాగే హైజవానీ హై తో ఇష్క్ హెూనా హై అనే మరో సినిమా షూటింగ్ లో పాల్గొంటుంది. ఈ సినిమాలతో పాటు కళాత్మక చిత్రాల దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ నిర్మిస్తున్న చిత్రంలోనే మృణాల్ అవకాశం అందుకుంది. ఇందులో సిద్దాంత్ చతుర్వేది హీరోగా నటిస్తున్నారు. రవి ఉద్యవార్ తెరకెక్కిస్తున్నాడు. ఇదొక రొమాంటిక్ ఎంటర్ టైనర్. ఆషీకీ -2 తరహాలో ఉంటుందని ప్రచారం జరుగుతోంది. మ్యూజికల్ లవ్ స్టోరీగా హైలైట్ చేస్తున్నారు.



తాజాగా ఈ సినిమా తుమ్ హీ హెూ అనే టైటిల్ ఖరారు చేసారు. ఇప్పటికే కొంత భాగం షూటింగ్ పూర్తయింది. ఇప్పటికే సిద్దాంత్-మృణాల్ మధ్య రొమాంటిక్ సన్నివే శాలు చిత్రీకరించారు. త్వరలో ఉత్తరాఖండ్ లో మరో షెడ్యూల్ ప్లాన్ చేస్తున్నారు. ఇందులో ఏకంగా బెడ్ రూమ్ సన్నివేశాలే హైలైట్ చేస్తున్నారుట. ఉత్తరాఖండ్ మంచు గుహల్లో హీరో-హీరోయిన్ మధ్య కొన్ని బెడ్ రూమ్ సన్నివేశాలు చిత్రీకరించనున్నారుట. మంచు గుహలో మంచుతో తయారు చేసిన మంచంపైనే ఈ సన్నివేశాలు ఎంతో అందంగా చిత్రీకరణ ప్లాన్ చేస్తున్నారుట. షూటింగ్ సమయంలో మంచు వేగంగా కరగకుండా ప్రత్యేకంగా కొన్ని రకాల రసాయనాల్ని విదేశాల నుంచి దిగుమతి చేసారుట. ఆ లొకేషన్ ని ఎంతో అందంగా అలంకరిం చాలన్నది యూనిట్ ప్లాన్ గా తెలుస్తోంది. ఇవి ఎంతో రియలిస్టిక్ గానూ ఉంటాయని తెలుస్తోంది. ఎలాంటి సన్నివేశాల్లోనైనా మృణాల్ జీవిస్తుంది. ఆమె పూర్తిగా దర్శకుల హీరోయిన్ గా మారిపోతుంది.





# బాక్సాఫీస్.. డిసెంబర్ లెక్క మారుతుందా లేదా..?



ఇండియన్ సినిమా ఇండస్ట్రీలో ఎక్కువ పాన్ ఇండియా మూవీస్ తెరకెక్కుతున్న ఇండస్ట్రీ అంటే టాలీవుడ్ అనే మాట వినిపిస్తోంది. టైర్ 2, టైర్ 1లో ఉన్న స్టార్ హీరోలు అందరూ కూడా యూనివర్సల్ అప్పీల్ ఉన్న కథలపైనే ఎక్కువగా ఫోకస్ చేస్తున్నారు. అలాంటి కథలు అయితే వీలైనన్ని ఎక్కువ భాషలలో రిలీజ్ చేసుకోవడానికి స్కోప్ దొరుకుతుంది. ఆ మూవీస్ థియేటర్స్ లో అన్ని భాషల ప్రేక్షకులకి కనెక్ట్ అయితే భారీ కలెక్షన్స్ రావడం గ్యారెంటీ. ఒకవేళ థియేటర్స్ లో తెలుగు వెర్షన్ మాత్రమే వర్క్ అవుట్ అయ్యి మిగిలిన భాషలలో ప్రేక్షకులకు కనెక్ట్ కాకపోయిన ఓటీటీ రైట్స్ ద్వారా భారీగా ఆదాయం వస్తుంది. ఈ రెండు విషయాలని దృష్టిలో ఉంచుకొని తెలుగు స్టార్ హీరోలు అందరూ కూడా తమ సినిమాలను పాన్ ఇండియా రేంజ్ లో రిలీజ్ చేస్తున్నారు. వీటిలో కొన్ని సినిమాలు వర్క్ అవుట్ అవుతున్నాయి. ముఖ్యంగా టైర్ 1లో ఉన్న మన తెలుగు స్టార్ హీరోల సినిమాలు దేశవ్యాప్తంగా క్లిక్ అవుతున్నాయి. బలమైన కథాంశాలతో తెరకెక్కే సినిమాలకు నార్త్ ఇండియన్స్ బ్రహ్మరథం పడుతున్నారు. దీంతో కలెక్షన్స్ భారీగా వస్తున్నాయి. ఇదిలా ఉంటే ఈ ఏడాది డిసెంబర్ లో టాలీవుడ్ నుంచి ఏకంగా నాలుగు పాన్ ఇండియా సినిమాలు థియేటర్స్ లోకి రాబోతున్నాయి. వాటిలో మోస్ట్ అవైటెడ్ మూవీ 'పుష్ప 2' కూడా ఉంది. ఈ సినిమా డిసెంబర్ 6న వరల్డ్ వైడ్ గా ఐదు భాషలలో రిలీజ్ కాబోతోంది. 'పుష్ప 2' చిత్రంపై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి. ఈ చిత్రం 1000 కోట్ల కలెక్షన్ క్లబ్ లో చేరుతుందని మేకర్స్ ఎక్స్ పెక్ట్ చేస్తున్నారు. అది సాధ్యం కాకపోయిన ఖచ్చితంగా భారీ కలెక్షన్స్ ని అందుకుంటుందని ట్రేడ్ పండితులు అంటున్నారు. దీని తర్వాత శేఖర్ కమ్ముల దర్శకత్వంలో ధనుష్, కింగ్ నాగార్జున హీరోలుగా తెరకెక్కుతున్న మల్టీస్టారర్ పాన్ ఇండియా మూవీ 'కుభేర' రిలీజ్ కానుంది. డిసెంబర్ 13 లేదా 20న ఈ చిత్రం థియేటర్స్ లోకి రాబోతున్నట్లు తెలుస్తోంది. అక్కినేని నాగచైతన్య హీరోగా గీత ఆర్ట్స్2 లో సిద్ధమవుతున్న పాన్ ఇండియా మూవీ 'తండేల్' డిసెంబర్ 20న రిలీజ్ కన్ఫర్మ్ చేశారు. ఆల్ మోస్ట్ అదే డేట్ కి రావడం ఖాయం అని మేకర్స్ అంటున్నారు. ఒక వేళ పోస్ట్ ప్రొడక్షన్ ఆలస్యం అయితే జనవరి 13న సంక్రాంతికి 'తండేల్' రిలీజ్ చేయాలని అనుకుంటున్నారు. నెక్స్ట్ గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ 'గేమ్ చేంజర్' మూవీ కూడా క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 20న రిలీజ్ చేయడానికి ప్లాన్ చేస్తున్నారు. దిల్ రాజు అయితే డిసెంబర్ లో 'గేమ్ చేంజర్' రిలీజ్ అని కన్ఫర్మ్ చేశారు. మరి శంకర్ ఆ సమయానికి అవుట్ పుట్ రెడీ చేస్తాడా అనేది వేచి చూడాలి.

# మత్తు వదలరా 2 రెస్పాన్స్ ఏ రేంజ్ లో ఉందంటే..




ఈ మధ్యకాలంలో టాలీవుడ్ లో కమిటీ కుర్రోళ్ళు, ఆయ్, మారుతీనగర్ సుబ్రహ్మణ్యం చిన్న సినిమాలుగా ప్రేక్షకుల ముందుకొచ్చి మంచి హిట్ టాక్ సొంతం చేసుకున్నాయి. ఈ సినిమాలు అన్ని కామెడీతో పాటు ప్రేక్షకులకి కనెక్ట్ అయ్యే ఎంటర్టైన్మెంట్ ని నమ్ముకొని థియేటర్స్ లోకి వచ్చి విజయాన్ని దక్కించుకున్నాయి. ఇప్పుడు ఈ వరుసలో మత్తు వదలరా 2 మూవీ కూడా చేరబోతోంది. సెప్టెంబర్ 13న రిలీజ్ అయిన ఈ సినిమాకి మొదటి ఆట నుంచి పాజిటివ్ టాక్ వస్తోంది. మత్తు వదలరా సీక్వెల్ గా ఈ మూవీని రితేష్ రానా తెరకెక్కించారు. శ్రీ సింహ, సత్య మొదటి సినిమా తరహాలోనే ఈ సీక్వెల్ లో కూడా తమదైన శైలిలో క్యారెక్టర్స్ ని పండించి ఫన్ జెనరేట్ చేశారు. శ్రీ సింహకి అయితే ఈ మూవీ హీరోగా బ్రేక్ ఇచ్చిందని చెప్పాలి. ఇక సత్య అయితే సినిమాలో ఆధ్యంతం నవ్విస్తూనే ఉన్నాడు. వీరికి ఫరియా అబ్దుల్లా తోడవడంతో కథ ప్రేక్షకులు ఫుల్ గా ఫన్ ని ఆస్వాదించారు. ఇదిలా ఉంటే మొదటి రోజు ఈ సినిమా 5.3 కోట్ల గ్రాస్ కలెక్షన్స్ చేసుకుంది. రెండో రోజు అడ్వాన్స్ బుకింగ్స్ లో అదే స్థాయిలో జోరు చూపిస్తోంది. 24 గంటల్లోనే 40.36%ఖ% టికెట్స్ అమ్ముడయ్యాయంట. దీనిని బట్టి ప్రేక్షకులు ఈ సినిమా చూడటానికి ఎంతగా ఆసక్తి చూపిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. బుక్ మై షో యాప్ లో ఏకంగా 9.4 పబ్లిక్ రేటింగ్ పాయింట్స్ ని మత్తు వదలరా 2 సొంతం చేసుకుంది. అంటే చూసిన ఆడియన్స్ అందరూ కూడా పాజిటివ్ గా రివ్యూలు ఇస్తున్నారని అర్థమవుతోంది. మైత్రీ మూవీ మేకర్స్, క్లాప్ ఎంటర్టైన్మెంట్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ సినిమా టికెట్ బుకింగ్స్ జోరు చూస్తుంటే మొదటి మూడు రోజుల్లోనే బ్రేక్ ఈవెన్ టార్గెట్ ని అందుకుంటుందని ట్రేడ్ పండితులు అంచనా వేస్తున్నారు. మత్తు వదలరా మూవీతో దర్శకుడిగా పరిచయం అయిన రితేష్ రానా మళ్ళీ సీక్వెల్ తో సూపర్ హిట్ ని తన ఖాతాలో వేసుకున్నాడు. ఈ మూవీ నిర్మాతలకి భారీగా ప్రాఫిట్ తీసుకు రావడం గ్యారెంటీ అని సినీ విశ్లేషకులు అంటున్నారు. ఎంటర్టైన్మెంట్ తో వచ్చి సక్సెస్ అందుకున్న మత్తు వదలరా 2 చూసిన తర్వాత భవిష్యత్తులో బడా నిర్మాతలు ఇలాంటి కథలకి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చే అవకాశం ఉందనే మాట వినిపిస్తోంది.

# సన్య మల్హోత్రా స్టన్నింగ్ లెదర్ కోట్ లుక్

సన్యా మల్హోత్రా నేటితరంలో బాలీవుడ్‌లో హాటెస్ట్ టాలెంట్ అన్న సంగతి తెలిసిందే. తన అద్భుతమైన నటప్రతిభ, బహుముఖ ప్రజ్ఞతో అందరి దృష్టిని ఆకర్షించిన ఈ బ్యూటీ బాలీవుడ్‌లో అత్యంత డిమాండ్ ఉన్న నటీమణిగా ఎదిగింది. విమర్శకుల ప్రశంసలు పొందిన చిత్రం దంగల్‌తో సన్య కెరీర్ ప్రారంభమైంది. ఈ చిత్రంలో సన్య రెజ్లర్ పాత్రతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. అప్పటి నుండి బదాయి హెూ, కథల్, జవాన్ సహా విభిన్న చిత్రాలలో అద్భుత పాత్రల్లో నటించి మెప్పించింది. సినిమాయేతర నేపథ్యం నుండి వచ్చినా కానీ, సన్యా పరిశ్రమలో తనకంటూ ఒక పవర్‌హౌస్ పెర్ఫామర్‌గా స్థిరపడింది.



వరుసగా అద్భుతమైన ప్రదర్శనలతో తన పరిధిని విస్తరించింది. సన్య తన అభిమానులకు నిరంతర ఫోటోషూట్లతోను అన్ లిమిటెడ్ ట్రీట్ ని ఇస్తోంది. ఇప్పుడు కూడా తన స్థాయిని స్టైల్ కంటెంట్ ని ఎలివేట్ చేసే ఫోటోషూట్ తో అభిమానుల హృదయాల్లోకి ఈ భామ దూసుకెళ్లింది. సన్య తాజా ఫోటోషూట్ ఇప్పుడు అంతర్జాలంలో హాట్ టాపిక్ గా మారింది. సాన్య మునుపెన్నడూ కనిపించని కొత్త లుక్ తో మెస్మరైజ్ చేస్తోంది. ఆల్ లెదర్ లుక్ తో తన పొడుగు కాళ్ల సౌందర్యాన్ని ఎలివేట్ చేస్తూ సన్య మల్హోత్రా ఇచ్చిన ఫోజ్ ఒకటి ఇంటర్నెట్ లో గుబులు పుట్టిస్తోంది. సన్య ఈసారి ఫోటోషూట్ కోసం రకరకాల డిజైనర్ దుస్తులను ఎంపిక చేసుకుంది. వీటిలో బ్రౌన్ లెదర్ జాకెట్ లో సాన్య ఎంతో ప్రత్యేకంగా కనిపించింది. సాన్య థై హై రూపం.. సాన్య థై స్లిట్ రూపం.. సాన్య లాంగ్ ఫ్రాక్ గెటప్.. సాన్య డిజైనర్ థండర్ షోస్ ఇలా రకరకాల కోణాల్లో ఈ ఫోటోషూట్ ప్రత్యేకం గా మారింది. ప్రస్తుతం ఇది ఇంటర్నెట్‌లో వైరల్‌గా దూసుకెళుతోంది.

# చీరలో మీనాక్షి.. ఆ అంధమేంటి బాబోయ్

ఇటీవల కాలంలో టాలీవుడ్‌లో బాగా ట్రెండ్ అవుతున్న నటి మెనాక్షి చౌదరి మరోసారి తన అందంతో సోషల్ మీడియాలో సందడి చేసింది. ఈ సారి ఆమె వైలెట్ కలర్ చీరలో తన అందాన్ని, నవ్వును ప్రదర్శిస్తూ ఫ్యాన్స్‌ను ఆకట్టుకుంది. ఆమె చీరలో ఉన్న క్లాసిక్ లుక్ అభిమానులను అద్భుతంగా ఆకర్షిస్తోంది. ఈ ఫోటో షూట్‌కి సంబంధించిన ఫోటోలు ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేయగా, అభిమానుల నుంచి మంచి స్పందన లభించింది. అందం, ప్రతిభ కలబోసుకున్న టాలీవుడ్ నటి మీనాక్షి చౌదరి, ప్రస్తుతం యువతలో మంచి క్రేజ్ సంపాదించుకుంది. మోడల్ గా కెరీర్ స్టార్ట్ చేసిన మీనాక్షి, "ఇచ్చట వాహనములు నిలుపరాదు"తో టాలీవుడ్‌లోకి అడుగుపెట్టి,



"ఖిలాడి", "హిట్ 2" వంటి చిత్రాలతో తన ప్రతిభను నిరూపించుకుంది. తెలుగులో ఈ బ్యూటీకి ప్రత్యేకమైన ఇమేజ్ ఏర్పడింది. రాబోయే రోజుల్లో మరింత క్రేజీ ప్రాజెక్టుల్లో నటించనుంది. ప్రస్తుతం ఆమె చేతిలో ఉన్న సినిమాల లైనప్ చూస్తే, "మెకానిక్ రాకీ," "విశ్వంభర," "లక్కీ భాస్కర్," మరియు "మట్కా" వంటి ప్రాజెక్టులతో బిజీగా ఉంది. ఇందులో ఏదైనా ప్రాజెక్ట్ హిట్ అయితే, ఆమె స్టార్ హీరోయిన్ల జాబితాలో చేరిపోతుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది. మీనాక్షి చౌదరి కేవలం టాలీవుడ్ లో మాత్రమే కాకుండా ఇతర ఇండస్ట్రీలలోనూ తన సత్తా చాటాలని చూస్తోంది. ఇటీవల విజయ్ హీరోగా నటించిన "%+ూాు%" సినిమాలో స్పెషల్ పాత్రలో నటించింది. ఈ ప్రాజెక్ట్ భారీగా సక్సెస్ కాలేదు కానీ ఆమెకి కొత్త అవకాశాలు వస్తున్నాయి. అదేవిధంగా, మీనాక్షి ఫ్యాషన్ సెన్స్ కూడా ప్రత్యేకంగా ఉంటుందనే చెప్పాలి. ఇక ఆమె అందాన్ని పొగుడుతూ ఫ్యాన్స్ రియాక్ట్ అవుతున్నారు. ఇటీవల కాలంలో అమ్మడు ఇలా తన అందంతో భారీగా ఫాలోవర్స్ ను పెంచుకుంటోంది. ఇక రాబోయే రోజుల్లో ఈ బ్యూటీ తన కెరీర్ ను మరింత ముందుకు తీసుకెళ్ళే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.



# కస్టమ్స్ సుంకం కోత దిగుమతులు డబుల్

దిల్లీ: పసిడిపై కస్టమ్స్ సుంకాన్ని భారీగా తగ్గించడం, పండగ సీజన్ వేళ పెరిగిన డిమాండ్ కారణంగా మన దేశ బంగారం దిగుమతులు భారీగా పెరిగాయి. ఆగస్టు నెలలో దిగమతులు రెట్టింపు అయ్యాయి. గతేడాది ఆగస్టులో 4.83 బిలియన్ డాలర్ల విలువైన బంగారాన్ని భారత్ దిగుమతి చేసుకోగా.. ఈ ఏడాది 10.06 బిలియన్ డాలర్లకు పెరిగినట్లు వాణిజ్య మంత్రిత్వ శాఖ మంగళవారం వెల్లడించింది. భారీ స్థాయిలో దిగుమతులు పెరగడంపై వాణిజ్య శాఖ కార్యదర్శి సునీల్ భర్త్వాల్ మాట్లాడుతూ.. కస్టమ్స్ సుంకం తగ్గించడం వల్లే దిగుమతులు పెరిగాయని పేర్కొన్నారు. స్మగ్లింగ్, ఇతర కార్యకలాపాలు తగ్గుముఖం పడుతున్నాయన్నారు. అలాగే, పండగల సీజన్ కావడంతో పెద్ద మొత్తం ఆభరణాలను వర్తకులు సిద్ధం చేస్తుంటారని విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. ఇటీవలి బడ్జెట్‌లో బంగారంపై కస్టమ్స్ సుంకాన్ని 15 శాతం నుంచి 6 శాతానికి కేంద్రం తగ్గించిన సంగతి తెలిసిందే. ప్రపంచంలో అత్యధికంగా బంగారాన్ని దిగుమతి చేసుకుంటున్న దేశాల్లో చైనా తర్వాతి స్థానంలో భారత్ నిలుస్తోంది. మన దేశ దిగుమతుల్లో 40 శాతం పసిడి వాటా స్విట్జర్లాండ్‌దే. 16 శాతంతో యూఏఈ, 10 శాతంతో దక్షిణాఫ్రికా ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. మరోవైపు దేశ మొత్తం దిగుమతుల్లో ఒక్క బంగారం వాటానే 5 శాతం కావడం గమనార్హం, అలాగే, ఆగస్టు నెలలో దేశ వాణిజ్య లోటు 29.65 బిలియన్ డాలర్లకు చేరడంలోనూ పసిడిది ప్రధాన పాత్ర. ఎగుమతుల కంటే దిగుమతులు ఎక్కువగా ఉన్నప్పుడు వాణిజ్య లోటు ఏర్పడుతుంది.

# వాళ్ల మెప్పు కోసమే రాజీవ్ విగ్రహ స్థాపన

హైదరాబాద్, సెప్టెంబర్ 17: ఢిల్లీ పెద్దల మెప్పు కోసమే సచివాలయం ఎదుట దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహాన్ని స్థాపించారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యలు చేశారు. మంగళవారం నాడు సెప్టెంబర్ 17 సందర్భంగా తెలంగాణ భవన్‌లో జాతీయ సమైక్యత దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను మాజీ మంత్రి ఆవిష్కరించారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ.. గతంలో సోనియాగాంధీని బలిదేవత అని, రాహుల్ గాంధీని ముద్దపప్పు అని తిట్టారని.. ఇప్పుడు వాటిని కవర్ చేసుకోవడానికి రాజీవ్ గాంధీ విగ్రహం పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజీవ్ గాంధీ కంప్యూటర్ కనిపెట్టాడని రేవంత్ రెడ్డి చెప్తున్నారని... కంప్యూటర్ కనిపెట్టిన ఛార్లెస్ బాబేజ్ ఆత్మ ఎక్కడున్నా బాధపడుతుందంటూ ఎద్దేవా చేశారు.

**మీకు చేతనైతే..** "మీకు చేతనైతే హామీలు అమలు చేయండి.. 420 అడ్డగోలు హామీలు అమలు చేయండి. చేతనైతే రైతు బంధు ఇవ్వండి వానాకాలంకు 14 రోజులే మిగిలింది. చేతనైతే కరెంటు సరిగా ఇవ్వండి. చేతనైతే పింఛన్లు, మహిళలకు ఇచ్చిన హామీలు నెరవేర్చండి. రేవంత్ రెడ్డి చేతనైతే మీరు ఇచ్చిన హామీలు నెరవేర్చండి" అంటూ హితవుపలికారు. పోలీస్ బండ్లల్లో డీజిల్ పోయడానికి నిధులు ఇవ్వడంలేదని విమర్శించారు. రామగుండంలో రూ.2 కోట్లు డీజిల్ బిల్లులు పెండింగ్ ఉన్నాయన్నారు. అక్కడ బంకు వాళ్లు పోలీస్ బండ్లకు డీజిల్ పోయడం లేదని తెలిపారు. ఇంకో 14 రోజుల్లో వర్షాకాలం ముగుస్తుందని.. ఇప్పటికీ రైతు భరోసా ఇవ్వలేదని మండిపడ్డారు.

# అభివృద్ధిలో తెలంగాణ ముందుకెళ్లాలని ఆకాంక్షిస్తూ..





అమరావతి, సెప్టెంబర్ 17: తెలంగాణ ప్రజలకు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తెలంగాణ విమోచన దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. దేశమంతటికీ 1947 ఆగస్టు 15వ తేదీన స్వాతంత్ర్య ఫలాలు దక్కినా.. నిజాం పాలనలో ఉన్న హైదరాబాద్ సంస్థానంలోని ప్రజలు ఆ స్వేచ్ఛా వాయువులు పీల్చుకోవడానికి మరో 13 నెలలు వేచి చూడాల్సి వచ్చిందన్నారు. మన దేశపు ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ పోలీస్ చర్య చేపట్టడంతో నిజాం పాలన నుంచి తెలంగాణ విముక్తమైందని తెలిపారు. సెప్టెంబర్ 17న స్వేచ్ఛ పొంది స్వతంత్ర భారతంలో భాగమైందన్నారు. నేడు తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా తెలంగాణ పౌరులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. నిజాం ఫ్యూడల్ పాలనకు వ్యతిరేకంగా సాగించిన పోరాటం తాలూకు స్ఫూర్తి ఇప్పటికీ ప్రజల్లో ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు వెళ్లాలని ఆకాంక్షిస్తున్నాను అని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వెల్లడించారు.

# హిందూసమాజాన్ని విచ్ఛిన్నం చేయాలనే శక్తులకు సరైన బుద్ధి చెప్పాలి

హైదరాబాద్: భాగ్యనగరంలో గణేష్ శోభాయాత్ర ఘనంగా జరుగుతోంది. నిమజ్జన శోభాయాత్రను చూడటానికి భక్తులు భారీగా తరలి వస్తున్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి రావడంతో ట్రాఫిక్ జాం నెలకొంది. ఈరోజు(మంగళవారం) నిమజ్జనం జరుగుతుండటంతో తెలంగాణ ప్రభుత్వం భారీ బందోబస్తు ఏర్పాట్లు చేసింది. హుస్సేన్ సాగర్ వరకు ఈ శోభాయాత్ర సాగనుంది. ఈ యాత్రలో హర్యాన గవర్నర్ బండారు దత్తాత్రేయ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో బండారు దత్తాత్రేయ మాట్లాడారు.

**సమైక్యంగా కలుపుకునేవే గణేష్ ఉత్సవాలు....** "హిందూ సమాజాన్ని విచ్ఛిన్నం చేయాలనే శక్తులకు సరైన బుద్ధి చెప్పాలని బండారు దత్తాత్రేయ హెచ్చరించారు. ఈరోజు అనంత చతుర్దశి.. మరోవైపు తెలంగాణ విమోచన దినోత్సవం. 1948 అనంత చతుర్దశి రోజు హైదరాబాద్ విమోచనం లభించింది. నిజం కబంధహస్తాల నుంచి రాష్ట్ర విమోచడం జరిగింది. తెలంగాణ విమోచన జరిగిన రోజు కూడా ఇదే ఆనందం ప్రజల్లో ఉంది. ఈరోజు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదిన శుభాకాంక్షలు. మోదీ భారత దేశాన్ని మరింత ముందుకు నడిపే శక్తిని ఆ భగవంతుడు ఇవ్వాలి.

విశ్వకర్మ జయంతి ఇదే రోజు చాలా మంచి రోజు. సమాజంలో అందరినీ సమైక్యంగా కలుపుకునేవే గణేష్ ఉత్సవాలు. కులం, మతం, భాషా. ప్రాంతం అనే తేడా చూడకుండా మనమంతా ఒక్కటే అనే భావన ఉంటుంది" అని బండారు దత్తాత్రేయ పేర్కొన్నారు.



**భారతీయ సంస్కృతిని కాపాడుతున్నారు...** "గణేష్ ఉత్సవాల్లో పాల్గొన్నా వేలాదిమందిని చూస్తుంటే ఆనందంగా ఉంది. మహిళలు, పిల్లలు భారతీయ సంస్కృతి సంప్రదాయాలను కాపాడుతున్నారు. భాగ్యనగరంలో గణేష్ నిమజ్జనం కార్యక్రమం చాలా వైభవంగా జరుగుతోంది. మన సంస్కృతి సంప్రదాయాల్లో మహిళలను గౌరవిస్తాం. రాష్ట్ర ప్రభుత్వ భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి గణేష్ ఉత్సవాలన ఘనంగా నిర్వహిస్తున్నాయి. నేను హర్యానా గవర్నర్నే కాదు.. అంత ముందుకు భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి కార్యకర్తను. 1981 నుంచి నేను ఈ భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి కార్యక్రమాల్లో పాల్గొంటున్నాను" అని బండారు దత్తాత్రేయ వెల్లడించారు.

# ఆదిలాబాద్‌లో ప్రజాపాలన దినోత్సవం

ఆదిలాబాద్ కలెక్టరేట్: ప్రజా పాలన దినోత్సవ వేడుకలు కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ముఖ్యఅతిథిగా హాజరై అమర వీరుల స్థూపం వద్ద నివాళి అర్పించారు. అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించారు.

ఆనాడు ప్రధాని నెహ్రూ ఆదేశాలతో అప్పటి హోం మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ నిజాం సంస్థానాన్ని భారత్ దేశంలో విలీనం చేసిన రోజు ఇదేనని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందన్నారు. కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌస్ ఆలం, డీసీసీబీ చైర్మన్ భోజారెడ్డి, అదనపు పాలానాదికారి శ్యామల దేవి, ఆర్డీవో వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# బాలాపూర్‌ను మించిన బండ్లగూడ

వినాయక ఉత్సవాల్లో ముఖ్య ఘట్టం లడ్డూల వేలం. నిమజ్జనం చేసే రోజు ఉదయం లడ్డూలను వేలం వేస్తారు. లడ్డూ దక్కించుకుంటే మంచి జరుగుతుందని చాలా మంది విశ్వసిస్తారు. అందుకోసం ఎంతైనా వేలం వేసేందుకు వెనకాడారు. గణేశ్ లడ్డూ వేలం పాట అంటే ముందుగా గుర్తొచ్చేది బాలాపూర్ లడ్డూ. బాలాపూర్ లడ్డూ కన్నా ఇతర చోట్ల లడ్డూలు మంచి ధర పలికాయి.

**రూ.కోటి పలికిన లడ్డూ...** బండ్లగూడలో ఓ లడ్డూ రూ.కోటి పైగా పలికింది. బండ్లగూడ జాగీర్‌లో కీర్తి రిచ్ మండ్ విల్లాస్‌లో వేలం జరిగింది. విల్లాలో ఉన్న కమ్యూనిటీ లడ్డూను దక్కించుకుంది. అందరూ కలిసి రూ.1.87 కోట్లకు వేలం వేశారు. గతంలో రూ.1.26 కోట్లకు లడ్డూను సొంతం చేసుకున్నారు. వచ్చిన డబ్బులను పేదల కోసం ఉపయోగిస్తామని ప్రకటించారు.

**రూ.30 లక్షలు :** బాలాపూర్ లడ్డూ రూ.30 లక్షల వెయ్యి రూపాయలు పలకింది. కొలను కుటుంబం లడ్డూను దక్కించుకుంది. కొలను శంకర్ రెడ్డి వేలం వేసి, ఆ వెంటనే కమిటీకి నగదును అందజేశారు. గత ఏడాది లడ్డూను రూ.27 లక్షలకు దాసరి దయానంద్ రెడ్డి దక్కించుకున్నారు. బాలాపూర్ లడ్డూ వేలం 1994లో రూ.450తో ప్రారంభమై.. ఇప్పుడు రూ.30 లక్షలకు చేరుకుంది.

– మాదాపూర్‌లో మై హోమ్ భుజాలో గణేశ్ లడ్డూ రికార్డు ధర పలికింది. ఖమ్మం జిల్లా కొండపల్లికి చెందిన గణేశ్ రూ.29 లక్షలకు లడ్డూను సొంతం చేసుకున్నారు. గత ఏడాది ఇక్కడ లడ్డూ రూ.25.50 లక్షలు పలికింది.

– విజయవాడ రూరల్ నున్న పంచాయతీ పరిధిలో లడ్డూ భారీ వేలం పలికింది. శ్రీసాయి బాలాజీ ఎన్ క్లేవ్ అపార్ట్ మెంట్‌లో లడ్డూ రూ.26 లక్షలు పలికింది. ప్రైవేట్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్లు సింగంరెడ్డి ప్రదీప్ రెడ్డి, నక్కా రామ్ లడ్డూను రూ.26 లక్షలకు సొంతం చేసుకున్నారు.

# చరిత్రలో 1948, సెప్టెంబర్ 17 గురించి డిప్యూటీ సీఎం ఏం చెప్పారంటే...

ఖమ్మం, సెప్టెంబర్ 17: తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా జిల్లా ప్రజలందరికీ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం నాడు పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. చరిత్రలో 1948వ సంవత్సరం సెప్టెంబర్ 17వ తేదీకి ఒక విశిష్టత ఉందని తెలిపారు. 76 సంవత్సరాల క్రితం ఇదే రోజున మన తెలంగాణ, నాటి హైదరాబాద్ సంస్థానం రాజుల పాలన నుంచి భారతదేశంలో అంతర్భాగంగా మారి ప్రజాస్వామ్య ప్రజాపాలన దశలోకి పరివర్తన చెందిందని తెలిపారు. తెలంగాణ ప్రజాస్వామిక స్వేచ్ఛను పొందడం కోసం ఆనాటి యావత్ సమాజం ఉద్యమించిందని గుర్తుచేశారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం సెప్టెంబర్ 17ను తెలంగాణ ప్రజాపాలన దినోత్సవంగా నిర్వహిస్తోందని తెలిపారు. ఈ ప్రజా ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాల మేరకు అభయహస్తం హామీలను ఒక్కొక్కటిగా అధికారంలోకి వచ్చిన 48 గంటల నుంచే అమలు చేయడం ప్రారంభించిందన్నారు.

**48 గంటల్లోనే రెండు గ్యారెంటీలు..** చివరి వరుసలోని పేదలకు కూడా ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందే లక్ష్యంతో ప్రజాపాలన కార్యక్రమం చేపట్టి దరఖాస్తులను స్వీకరించి అర్హులైన లబ్ధిదారులకు పథకాల ఫలాలు అందించడం జరుగుతోందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి గ్యారెంటీ పథకాలను అందించే దిశగా జిల్లాలోని ఎంపీడీఓ కార్యాలయాలు, సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో ప్రజాపాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చేశామని డిప్యూటీ సీఎం చెప్పారు. హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో రెండు గ్యారెంటీలను ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించిన 48 గంటల్లోనే అమలు చేసి చరిత్ర సృష్టించిందన్నారు. ఆడ బిడ్డలకు తొలి ప్రాధాన్యత ఇస్తూ ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించామని.. ఈ పథకం ద్వారా ఇప్పటి వరకూ రాష్ట్రంలో 87.12 కోట్ల ఉచిత ప్రయాణాలు మహిళలు చేశారన్నారు. ఉచిత ఆర్టీసీ పథకం ద్వారా మహిళలకు 2958 కోట్ల రూపాయలు ఆదా చేయగలిగామన్నారు. ఈ పథకం ద్వారా ఖమ్మం జిల్లాలో మహిళలకు దాదాపు 1,79,97,210 పైగా జీరో టికెట్లను జారీ చేశామని.. ఉచిత బస్సు ప్రయాణం వల్ల మహిళలు దాదాపు 8432.83 లక్షల రూపాయలను ఆదా చేశారని చెప్పారు.

**రూ.500 కే వంటగ్యాస్ సిలెండర్ :** రూ. 500 కే వంటగ్యాస్ సిలెండర్ పంపిణీ ఆడబిడ్డల కన్నీళ్లు తుడవాలన్న లక్ష్యంతో ప్రారంభించిందే మహాలక్ష్మి పథకంలోని మరో పథకం 500



రూపాయలకే వంట గ్యాస్ ఇవ్వాలన్న ఆలోచన అని చెప్పుకొచ్చారు. ఈ కార్యక్రమాన్ని ఈ ఏడాది ఫిబ్రవరి 27న ప్రారంభించామన్నారు. 40 లక్షల మంది లబ్ధిదారులతో మొదలైన ఈ పథకం ప్రస్తుతం రాష్ట్రంలో 42.90 లక్షల మంది లబ్ధి పొందుతున్నారన్నారు. ఖమ్మం జిల్లాలో ఇప్పటి వరకు 3 లక్షల 94 వేల 753 మంది వినియోగదారులకు గ్యాస్ సిలిండర్లను సబ్సిడిపై సరఫరా చేసి సంబంధిత లబ్దిదారుల బ్యాంక్ ఖాతాలలో 1119.71 లక్షల రూపాయలు సబ్సిడీ సొమ్ము జమ చేశామన్నారు.

**ప్రతీ ఇంటికి ఉచిత వెలుగులు..** గృహజ్యోతితో పేదల ఇంట వెలుగులు అల్పాదాయ వర్గాలవారికి విద్యుత్ బిల్లుల భారం తగ్గించి, వారి గృహాలలో చీకట్లను పారద్రోలి, విద్యుత్ కాంతులను నింపేందుకు గృహజ్యోతి పథకం అమలు చేస్తున్నామన్నారు. 200 యూనిట్ల కంటే తక్కువ విద్యుత్ వాడే ప్రతి ఇంటికి ఉచిత వెలుగులు పంచుతున్నామన్నారు. ఈ పథకాన్ని 2024 మార్చిలో ప్రారంభించామని చెప్పారు. రాష్ట్రంలో 48 లక్షల 62 వేల 682 మంది గృహజ్యోతి పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారన్నారు. 2024 మార్చి 1 నుంచి ఇప్పటి వరకు ఖమ్మం జిల్లాలో 2,57,995 వినియోగదారులకు నెలకు రూ. 9.48 కోట్ల సబ్సిడీ చొప్పున ఆగస్టు 2024 వరకు రూ. 49.97 కోట్లు సబ్సిడీ ఇవ్వడం జరిగిందన్నారు. రాష్ట్రంలో రికార్డు స్థాయిలో విద్యుత్ డిమాండ్ వచ్చినప్పటికీ ఎటువంటి కోతలు లేకుండా అన్ని రంగాల వారికి 24 గంటల పాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేశామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు.



# ఆప్ టాప్ ఛాయిస్ ఆమె..!

ఆతిశీ మార్లీనా సింగ్.. ఈ పేరుకు దిల్లీ రాజకీయాల్లో పెద్దగా పరిచయం అక్కర్లేదు. తన వాగ్ధాటితో ప్రతిపక్షాలను ముప్పుతిప్పలు పెట్టడంలో ఆమె దిట్ట. ఉన్నత విద్యావంతురాలు కావడంతో దిల్లీ ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలనే మార్చేసిన ఘనత ఆమెది. మద్యం కుంభకోణంతో దుమ్ముకొట్టుకుపోయిన ఆప్ ప్రతిష్ఠను నిలబెట్టే బాధ్యతను ఇప్పుడు పార్టీ అగ్రనాయకత్వం ఆమె భుజస్కంధాలపై పెట్టింది. కేజ్రీవాల్ తర్వాత పార్టీలోని ఉద్దండులను పక్కనపెట్టి మరీ ముఖ్యమంత్రి పీఠాన్ని కట్టబెట్టింది. ఇక అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆమె దిల్లీ ప్రభుత్వాన్ని నడపనున్నారు. కేజ్రీవాల్ బెయిల్‌పై బయటకు వచ్చిన వెంటనే తాను రాజీనామా చేయనున్నట్లు ప్రకటించడం రాజకీయ ప్రకంపనలు సృష్టించింది. దీంతో ఆతిశీ, గోపాల్ రాయ్, కైలాశ్ గెహ్లాత్, సౌరభ్ భరద్వాజ్, సునీతా కేజ్రీవాల్ వంటి వారి పేర్లు తెరపైకి వచ్చాయి. మనీశ్ సిసోదియాపై కేసులు ఉండటంతో ఆయన ఊసే లేదు.

**కేజ్రీవాల్ లేని వేళ పార్టీని నడిపించి..** దిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు అత్యంత సన్నిహితుల్లో ఆతిశీ మినహా అందరూ మద్యం కేసులో జైలుకు వెళ్లారు. మార్చి 21న ఆయన కూడా అరెస్టు కావడంతో ఆప్ పగ్గాలు చేపట్టడానికి ద్వితీయశ్రేణి నాయకత్వం కరవైంది. నాడు ఆతిశీ పేరు తెరపైకి వచ్చినా.. కేజ్రీవాల్ జైలు నుంచే ప్రభుత్వాన్ని నడపాలని నిర్ణయించుకొన్నారు. ఆ సమయంలో ఆతిశీ అన్నీ తానై సౌరభ్ భరద్వాజ్‌తో కలిసి పార్టీని ముందుకు నడిపారు. ఓవైపు లోక్‌సభ ఎన్నికలు ముంచుకొస్తుండటంతో నాడు మీడియాలో పార్టీపై ప్రతిపక్షాల దాడులను సమర్థంగా ఎదుర్కొన్నారు. హరియాణా నుంచి దిల్లీకి రోజుకు 100 మిలియన్ గ్యాలెన్ల నీటిని విడుదల చేయడం లేదంటూ ఏకంగా జూన్‌లో నిరాహార దీక్ష చేపట్టారు. ఆ సమయంలో ఆమె ఆరోగ్యం క్షీణించడంతో ఆస్పత్రి పాలయ్యారు.

# రాష్ట్ర ప్రతిష్ఠను దెబ్బతీస్తున్న సీఎం రేవంత్.. హరీష్‌రావు విసుర్లు

మెదక్ జిల్లా: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిల్లర రాజకీయాలు మాని ప్రజలకు మంచిపాలన అందించాలని మాజీ మంత్రి, సిద్ధిపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్‌రావు కోరారు.

సీఎం రేవంత్ రాష్ట్రానికి మేలు చేస్తున్నారో.. కీడు చేస్తున్నారోప్రజలు ఆలోచించాలని అన్నారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్నప్పుడు రాష్ట్ర ప్రయోజనాల కోసమే రేవంత్‌రెడ్డి పని చేయాలని హితవు పలికారు. సీఎం పదవిని అడ్డం పెట్టుకొని రేవంత్‌రెడ్డి రాజకీయాలు చేస్తున్నారని విమర్శలు చేశారు.

**ఆర్థిక సంఘాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారు...** రాష్ట్రంలో ఇప్పటివరకు ఏ ముఖ్యమంత్రి కూడా రేవంత్‌రెడ్డి లాగా వ్యవహరించలేదని చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో హరీష్‌రావు ఈరోజు (మంగళవారం) మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ... ప్రజాపాలన ప్రసంగంలో సీఎం రేవంత్‌రెడ్డి అన్ని అబద్ధాలే మాట్లాడారని హరీష్‌రావు అన్నారు. ఆర్థిక సంఘాన్ని తప్పుదోవ పట్టించేందుకు బురద జల్లుతున్నారని హరీష్‌రావు ఆరోపణలు చేశారు. 100 రోజుల్లో రేవంత్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను పూర్తిగా ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు.

**రుణమాఫీపై మోసం...** డిసెంబర్9న రైతులకు పూర్తిగా రుణమాఫీ చేస్తామని మోసం చేశారని హరీష్‌రావు అన్నారు. కేసీఆర్ సీఎం కాగానే మొదటి నెలలోనే రూ.2 వేల పింఛన్ ఇచ్చారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 4 వేల పెన్షన్ ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. 2024 మార్చి వరకు కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న అప్పులను.. బీఆర్ఎస్ ప్రభుత్వం మీద నెట్టేస్తున్నారని హరీష్‌రావు విమర్శించారు. బీఆర్ఎస్ సర్కార్ తీసుకున్న అప్పు రూ 4.26 లక్షల కోట్లు అని తానే గతంలో చెప్పానని హరీష్‌రావు గుర్తుచేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పుడేమో రూ .7 లక్షల అప్పు రాష్ట్రంపై ఉందని చెబుతున్నారని హరీష్‌రావు అన్నారు.



**హామీల అమల్లో విఫలం..** నేడు రాష్ట్రం దివాళా అంటూ తెలంగాణ ప్రతిష్ఠను దిగజార్చుతున్నారని ధ్వజమెత్తారు. 'రాష్ట్ర ప్రతిష్ఠ దెబ్బతీస్తే నువ్వు తీసుకున్న గోతిలో నువ్వే పడుతావు' అని హరీష్‌రావు హెచ్చరించారు. రాష్ట్ర భవిష్యత్ కంటే నీకు రాజకీయాలే ముఖ్యమయ్యా యా అని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు ఎందుకు అమలు చేయడం లేదని నిలదీశారు. కేసీఆర్‌ను తిట్టడమే సీఎం రేవంత్ పరమావధిగా పెట్టుకున్నారని హరీష్‌రావు విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలలు, హాస్టలల్లో విద్యార్థులు సమస్యలతో సతమతం అవుతున్నారని హరీష్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు.

**అమరుల ఆత్మ ఘోషిస్తోంది..** జై తెలంగాణ అననోళ్లు.. అమరవీరుల స్తూపం వద్ద శ్రద్ధాంజలి ఘటించారని.. దీంతో తెలంగాణ అమరుల ఆత్మ ఘోషిస్తోందని అన్నారు. 2013 –14 లో రూ. 1,43,739 తలసరి ఆదాయం ఉండేదని.. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో రూ 3,47,221 పెరిగిందని చెప్పారు. రాష్ట్ర స్థూల ఉత్పత్తి ఆదాయం రూ.4,51,580 కోట్లు ఉంటే నేడు కాంగ్రెస్ ప్రభుత్వంలో రూ. 14,63,9,63 లక్షలకు పెరిగిందని హరీష్‌రావు అన్నారు.

# కౌశిక్ రెడ్డికి మతి భ్రమించింది..

హైదరాబాద్: బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతున్నారని ఇది సమాజానికి, రాజకీయ నాయకులకు మంచిది కాదని వెంటనే ఒళ్లు దగ్గర పెట్టుకొని రాజకీయం చేసుకోవాలని టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్ పేర్కొన్నారు. ఈ మేరకు గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన నాయకుల సమీక్షా సమావేశంలో గౌరీసతీష్ మాట్లాడుతూ... పాడి కౌశిక్ రెడ్డి గతంలో కాంగ్రెస్ పార్టీలో పనిచేశాడని 'నీ స్థాయి ఏమిటో' కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు, రాష్ట్ర ప్రజలకు తెలుసని సతీష్ కుమార్ గుర్తుచేశారు. గత జీహెచ్‌ఎంసీ(%+ఎవీజ%) ఎన్నికల్లో కార్పొరేటర్ టికెట్ల బీ–ఫామ్‌లను అమ్ముకున్న చరిత్ర మరిచిపోయావా కౌశిక్ రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షులు మహేశ్‌కుమార్‌గౌడ్‌పై మాట్లాడే



నైతికహక్కు, అర్హత లేదన్నారు. 'నీ ఆరోగ్యం రోజు రోజుకు క్షీణిస్తుంది. వెంటనే ఎర్రగడ్డ ఆసుపత్రికి వెళ్లి వైద్య సేవలు పొందాలి' అని అన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com